

విశాఖ ఉక్కుకు ఊపిరి

- రూ.17 వేల కోట్ల సాయానికి కేంద్ర కేబినెట్ ఆమోదం
- నేడు పూర్తి వివరాలు వెల్లడి
- సీఎం చంద్రబాబునాయుడు అభ్యర్థన మేరకు సాయానికి ప్రధాని పచ్చజెండా

- వార్త మెయిన్‌లో

నామినేటెడ్ పదవులకు ఆశావహుల యత్నాలు

పార్టీల అధిష్ఠానానికి కూటమి నేతల బయోడేటాలు



రామానాయుడు



లాలం భవానీ



లాలం కాశినాయుడు



కోట్ని బాలాజీ

- తమకు అవకాశం కల్పించాలని పలువురి వినతి
- ఉమ్మడి జిల్లాలో డీసీసీబీ, డీసీఎంఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవులపై పలువురి కన్ను
- రేసులో గవిరెడ్డి, కాశినాయుడు, భవానీ, బాలాజీ, ముత్యాలపాప, జనసేన రాజు
- రెండు, మూడు రోజుల్లో జాబితా విడుదల అవుతుందని ప్రచారం



పీవీఎస్ఎన్ రాజు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న కూటమి నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటికే రెండు విడతల్లో నామినేటెడ్ పదవులు భర్తీ చేసిన చేసిన విషయం తెలిసిందే. మూడో విడత పదవుల పంపకానికి పార్టీల పెద్దలు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వివిధ కారణాల వల్ల టీడీపీ అధిష్ఠానం పలువురు నాయకులకు టికెట్లు ఇవ్వలేకపోయింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నామినేటెడ్ పదవులు ఇస్తామని పార్టీ పెద్దలు హామీ ఇవ్వడంతో వారంతా పోటీ నుంచి వైదొలిగి కూటమి అభ్యర్థుల గెలుపుకోసం పనిచేశారు. దీంతో అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుకు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, ఎలమంచిలి టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావుకు రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ మాడుగుల ఇన్‌చార్జి పీవీజీ కుమార్‌కు వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లికి చెందిన మళ్ల సురేంద్రకు గవర సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పదవులు లభించాయి. అయితే టీడీపీతోపాటు కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులు కూడా నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో మూడో విడత నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్నట్టు యువనేత నారా లోకేశ్ చెప్పడంతో ఆశావహుల్లో మళ్లీ ... మిగతా 6వ పేజీలో



భారీగా మద్యం అమ్మకాలు!

- సంక్రాంతి సందర్భంగా తెగ తాగేసిన మందుబాబులు
- రెండు రోజుల్లో రూ.12.91 కోట్ల వ్యాపారం
- 14,740 కేసుల లిక్కర్, 5,223 కేసుల బీర్ విక్రయం
- సాధారణ రోజులతో పోలిస్తే రెట్టింపు!

అనకాపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):

సంక్రాంతి పండుగ సందర్భంగా మందుబాబులు 'ఫుల్' ఖుషీగా గడిపారు. సాధారణ రోజులతో పోలిస్తే మద్యం అమ్మకాలు రెట్టింపు అయ్యాయి. పండగ సందర్భంగా మద్యం డిపోలకు మంగళ, బుధవారాలు ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో లిక్కర్ షాపుల నిర్వాహకులు సోమవారంనాడు పెద్ద మొత్తంలో సరకు లిఫ్ట్ చేశారు. ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం, ఇతర కారణాల వల్ల వేరే ప్రాంతాలకు వలస పోయిన వారు సంక్రాంతి పండుగకు తప్పకుండా సొంతూరు వస్తుంటారు. పురుషులు మూడు రోజులపాటు మందు, ముక్కతో ఉల్లాసంగా గడుపుతుంటారు. దీంతో మద్యం అమ్మకాలు బాగా పెరిగాయి. తద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. జిల్లాలో 146 మద్యం షాపులు, 10 బార్లు ఉన్నాయి. రోజువారీ సగటు మద్యం అమ్మకాలు రూ.3 కోట్లు. గత ఏడాది సంక్రాంతితో పోల్చితే ఈసారి సంక్రాంతికి మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. గత ఏడాది 14, 15 తేదీలో రూ.6 కోట్ల విలువ చేసే మద్యం అమ్మకాలు జరగ్గా.. ఈసారి రూ.12.91 కోట్ల విక్రయాలు జరిగాయి. గత రెండు రోజుల్లో 14,740 లిక్కర్ కేసులు, 5,223 బీర్ కేసులు అమ్ముడుపోయాయి. జిల్లాలో గ్రామాలు, పట్టణాల్లో తీర్థాలు, పరసలు మొదలు కావడంతో రానున్న రోజుల్లో మద్యం విక్రయాలు గణనీయంగా పెరుగుతాయని వ్యాపారులు భావిస్తున్నారు.

ఇన్‌చార్జుల మార్పుపై వైసీపీ కసరత్తు

మాజీ మంత్రి అమర్‌కు చోడవరం బాధ్యతలు



గుడివాడ అమర్‌నాథ్



కరణం ధర్మశ్రీ

- భీమిలి వెళ్లాలని ధర్మశ్రీకి సూచన... తిరస్కరించినట్టు ప్రచారం
- అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించే యోచనలో అధిష్ఠానం
- మాడుగుల సమన్వయకర్తగా బూడి

చోడవరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):

శాసనసభ ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోవడంతో అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తల మార్పుపై అధిష్ఠానం దృష్టిసారించింది. ఉమ్మడి జిల్లాలో కొన్ని నియోజకవర్గాలకు కొత్త ఇన్‌చార్జులను నియమిస్తున్నట్టు సమాచారం. నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులను సమీక్షించడంతోపాటు, ఆయా స్థానాల్లో వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఇప్పుడే ఎంపిక చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్టు కిందిస్థాయి నాయకులకు సమాచారం వచ్చింది. దీనిలో భాగంగా చోడవరం నియోజకవర్గం సమన్వయకర్తగా మాజీ మంత్రి గుడివాడ్ అమర్‌నాథ్‌ను నియమించనున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతున్నది.

గత ఏడాది సాధారణ ఎన్నికల ముందే అమర్‌ను అనకాపల్లి నుంచి చోడవరానికి మారుస్తారని, స్థానిక సిట్టింగ్ ఎమ్మెల్యే ధర్మశ్రీని అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా బరిలో దించుతారని ప్రచారం జరిగింది. కానీ వివిధ సమీకారణాల నేపథ్యంలో అమర్ విశాఖ జిల్లా గాజువాక నుంచి పోటీ చేయగా, చోడవరంలో ధర్మశ్రీనే కొనసాగించారు. ఎన్నికల్లో ఊహించని రీతిలో ప్రతికూల ఫలితాలు రావడంతో నియోజకవర్గాల ఇన్‌చార్జుల మార్పులనే నిర్ణయానికి అధిష్ఠానం వచ్చినట్టు తెలిసింది. భీమిలి మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైసీపీకి రాజీనామా చేయడంతో గుడివాడ అమర్‌నాథ్‌ను ఆ నియోజకవర్గ సమన్వయకర్తగా వెళ్లాలని పార్టీ అధిష్ఠానం కోరిందని, అయితే తనకు భీమిలి వద్దని, అనకాపల్లి జిల్లాలో ఏదో ఒక అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించాలని ఆయన కోరినట్టు తెలిసింది. దీంతో గుడివాడ్ అమర్‌ను చోడవరం ఇన్‌చార్జిగా నియమించాలని పార్టీ పెద్దలు ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఇదే సమయంలో భీమిలి నియోజకవర్గం సమన్వయకర్తగా వెళ్లాలని ధర్మశ్రీని పార్టీ ఆదేశించినట్టు ప్రచారం జరుగుతున్నది. అయితే భీమిలి వెళ్లేందుకు ధర్మశ్రీ ఆసక్తి చూపించకపోవడంతో అక్కడ మరొకరిని నియమించాలని అధిష్ఠానం భావిస్తున్నట్టు చెబుతున్నారు. గుడివాడ అమర్ చోడవరం రావడం ఖాయం కావడంతో ధర్మశ్రీని అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించి, వచ్చే ఎన్నికల్లో ఆయనను ఎంపీ అభ్యర్థిగా బరిలో దించుతారని అంటున్నారు.

చోడవరానికి పలువురి పేర్లు పరిశీలన

చోడవరం నియోజకవర్గానికి ధర్మశ్రీ స్థానంలో స్థానిక నేతల్లో ఒకరిని సమన్వయకర్త ఎంపిక చేయాలని భావించిన అధిష్ఠానం...డాక్టర్ బండారు సత్యనారాయణ, మార్కెట్ కమిటీ ... మిగతా 6వ పేజీలో



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిట

- సంక్రాంతి తిరుగు ప్రయాణికులతో పెరిగిన రద్దీ
- అనకాపల్లి నుంచి ప్రత్యేక సర్వీసులు

అనకాపల్లి టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):

సంక్రాంతి పండుగ తిరుగు ప్రయాణాలతో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీగా మారింది. వివిధ కారణాల వల్ల వేరే ప్రాంతాలకు వలసపోయిన వారు సంక్రాంతి పండుగను బంధువులతో కలిసి జరుపుకోవడానికి మూడు, నాలుగు రోజుల క్రితం సొంతూళ్లకు వచ్చారు. బుధవారం కనుమ పండగ ముగియడంతో గురువారం తిరుగు ప్రయాణం ప్రారంభించారు. దీంతో ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రయాణికులతో కిటకిటలాడింది. రద్దీకి తగినట్టు బస్సు సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో ప్లాట్‌ఫారాలపై ఎక్కువ సేపు వేచి వుండాల్సి వచ్చింది. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు బయలుదేరిన బస్సులన్నీ కాంప్లెక్స్‌లోకే పూర్తిగా నిండిపోయాయి. పలువురు సీట్లు లభించక నిల్చుని ప్రయాణించాల్సి వచ్చింది. బస్సులు ఎక్కే సమయంలో తోసుకోవడంతో చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. సాయంత్రం నాలుగు గంటల తరువాత ప్రయాణికుల తాకిడి మరింత పెరిగింది. దేవరాపల్లి, విజయనగరం, పాయకరావుపేట, విశాఖపట్నం, చోడవరం, నర్సీపట్నం మార్గాల వైపు వెళ్లే బస్సులు కిక్కిరిసి ప్రయాణించాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని విజయవాడకు రెండు, పలాసకు రెండు, పాయకరావుపేటకు రెండు బస్సులను ప్రత్యేకంగా నడుపుతున్నట్లు ఇన్‌చార్జి డీఎం రవిచంద్ర చెప్పారు.



పల్లె వెలుగు బస్సులోకి ఎక్కుతున్న ప్రయాణికులు

పశువుల బీమాకు బ్రేకులు

- గత ఏడాది సెప్టెంబరు నుంచి నిలిచిన పథకం
- టీడీపీ గత పాలనలో పకడ్బందీగా అమలు
- వైసీపీ అధికారంలోకి రాగానే నిలుపుదల
- నాలుగేళ్లపాటు అమలుకు నోచుకోని పథకం
- రైతుల నిరసనతో 2023లో పునఃప్రారంభం
- అస్తవ్యస్తంగా ఉండడంతో తాత్కాలికంగా నిలిపేసిన కూటమి ప్రభుత్వం
- వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పకడ్బందీగా అమలుకు కసరత్తు



నర్సీపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):

పశువుల బీమా పథకం అర్ధంతరంగా ఆగిపోయింది. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు పశువుల బీమా పథకం సమర్థంగా అమలైంది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం.. ఈ పథకాన్ని నిలిపివేసింది. రైతుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో ఎట్టకేలకు 2023 జూన్‌లో పశువుల బీమా పథకాన్ని ప్రారంభించింది. గత ఏడాది జూన్‌తో గడువు ముగిసింది. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం సెప్టెంబరు వరకు కొనసాగించింది. వైసీపీ హయాంలో బీమా పథకం విధివిధానాలు అస్తవ్యస్తంగా వుండడంతో తాత్కాలికంగా నిలుపుదల చేసింది. మళ్లీ కొత్తగా విధివిధానాలు ఖరారు చేసి రానున్న ఆర్థిక సంవత్సరం (2025-26) నుంచి పశువుల బీమా పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

పంట సాగు తరువాత వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎక్కువ మంది రైతులు ఆధారపడుతున్నది పాడి పశువులు, జీవాల పోషణపైనే. అన్నదాతకు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ కూడా అంతే ముఖ్యం. పాడి పశువుల ద్వారా వచ్చే అదనపు ఆదాయం వారిని ఎంతో ఆదుకుంటున్నది. కొంతమంది రైతులు వ్యవసాయాన్ని మానేసి, గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలను మేపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. రైతులకు ఎంతో ప్రధానమైన పశువులు, జీవాలు వ్యాధులకుగురై మృత్యువాత పడుతుంటాయి. దీంతో ఆయా రైతులు ఆర్థికంగా చాలా నష్టపోతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు పశువుల బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. తుపాన్లు, వరదలు, పిడుగులు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తులు, విద్యుదాఘాతం, వాహనాలు ఢీకొనడం, పశువులు కుమ్ముకోవడం వంటి ప్రమాదాలు, వివిధ రకాల వ్యాధులబారిన పడి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు చనిపోతే సంబంధిత బీమా కంపెనీ నుంచి నష్టపరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో రైతులు తమ పశువులు, జీవాలకు బీమా ... మిగతా 6వ పేజీలో

గోవాడ షుగర్స్ కార్మికుల ఆందోళన



షుగర్ ఫ్యాక్టరీలో మోకాళ్లపై నిల్చుని ఆందోళన చేస్తున్న కార్మికులు

- వేతన బకాయిలు చెల్లింపులో ఎండీ మాట నిలుపుకోలేదని ఆరోపణ
- మోకాళ్లపై నిల్చుని నిరసన
- చెరకు క్రషింగ్ ప్రారంభంపై సందిగ్ధత

చోడవరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన ఆందోళన సంక్రాంతి పండగ అనంతరం గురువారం తిరిగి మొదలైంది. వేతనాల చెల్లింపు విషయంలో మాటనిలబెట్టుకోని యాజమాన్య వైఖరికి వ్యతిరేకంగా కార్మికులు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. వేతన బకాయిలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కార్మికులు వారం రోజుల క్రితం ఆందోళన ప్రారంభించి, ఎండీ సన్యాసినాయుడుని నిర్బంధించిన సంగతి తెలిసిందే. సంక్రాంతినాటికి వేతనాలు చెల్లించేలా చూస్తామని ఇచ్చిన హామీని ఎండీ అమలు చేయలేకపోయారు. దీంతో పండుగ మూడు రోజుల విరామం ఇచ్చిన కార్మికులు.. తిరిగి గురువారం ఫ్యాక్టరీ ఆవరణలో ఆందోళన ప్రారంభించారు. ఈ సందర్భంగా గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు కేవీవీఎస్ భాస్కరరావు ... మిగతా 6వ పేజీలో

సముద్ర తీరంలో ఇసుక దోపిడీ

- రాంబిల్లి మండలంలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- అలలకు చేరువలో భారీ గోతులు
- పట్టించుకోని అటవీ శాఖ అధికారులు



వాడపాలెం వద్ద సముద్ర తీరంలో ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గోతులు


రాంబిల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని పలు గ్రామాల వద్ద సముద్ర తీరంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రధాన రహదారి నుంచి సముద్ర తీరం వరకు ట్రాక్టర్లు వెళ్లడానికి బాటలను ఏర్పాటు చేసుకున్నారు. వాహనాలు ఇసుకలో కూరుకుపోకుండా వుండడానికి బాటల్లో అరటి, కొబ్బరి ఆకులు వేస్తున్నారు. ఈ గ్రామాల వద్ద తరచూ ఇసుక తవ్వకాలు జరుగుతున్నప్పటికీ అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.

రాంబిల్లి మండలం వాడపాలెం, కొత్తపట్నం, సీతపాలెం గ్రామాల వద్ద సముద్రతీరం వెంబడి ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా అక్రమార్కులు ఇసుకను తవ్వి, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. వాస్తవంగా సముద్రం ఇసుకను ఇళ్ల నిర్మాణాలకు వినియోగించరు. అయితే ఇళ్ల నిర్మాణంలో పునాదులు నింపడానికి, లేఅవుట్లు, ఇతర ఖాళీ స్థలాలను ఎత్తు చేయడానికి ... మిగతా 6వ పేజీలో

వేడుక ఏదైనా..
సందర్భం ఎటువంటిదైనా

- వివాహ వార్షికోత్సవం
- స్వదేశీ, విదేశీయానం
- లీగల్ ప్రకటనలు
- పదవీ విరమణ
- శ్రద్ధాంజలి
- జన్మదినం
- షష్టిపూర్తి
- జయంతి
- వర్ధంతి
- క్లాసిఫైడ్స్



మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు తక్కువ ఖర్చుతో ఆంధ్రజ్యోతిలో ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలియజేయండి

ఆంధ్రజ్యోతి
ప్రకటనల కొరకు సంప్రదించండి
9985411644

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

▸▸ చినతీనార్ల తీరంలో గుర్తించిన మత్స్యకారులు


చినతీనార్ల తీరానికి కొట్టుకువచ్చిన మణికంఠ మృతదేహం

నక్కపల్లి/ఎస్.రాయవరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం తీరంలో కనుమపండుగ రోజున గల్లంతైన యువకుడి మృతదేహాన్ని గురువారం నక్కపల్లి మండలం చినతీనార్ల సముద్రతీరంలో స్థానిక మత్స్యకారులు గుర్తించారు. బుధవారం రేవు పోలవరం తీరంలో కొట్టుకుపోతున్న సాత్విక్ అనే బాలుడిని రక్షించే క్రమంలో ప్రత్తిపాడు మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన కాకర్ల మణికంఠ(23) గల్లంతైన విషయం తెలిసిందే. ఆ యువకుడి మృతదేహం 6 కిలోమీటర్ల దూరంలో వున్న చినతీనార్ల తీరం ఒడ్డుకు గురువారం కొట్టుకువచ్చింది. స్థానిక గ్రామస్థాయి అధికారులు సమాచారాన్ని పోలీసులకు అందజేశారు. ఈ మేరకు మెరైన్ పోలీసులకు, ఎస్.రాయవరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించారు. మృతుడు మణికంఠ తల్లిదండ్రులు రాము, పార్వతి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అలాగే మృతిచెందిన బాలుడు సాత్విక్ మృతదేహానికి తుని ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్.రాయవరం హెడ్‌కానిస్టేబుల్ భూలోక తెలిపారు.

ఆశావహుల యత్నాలు

... 5వ పేజీ తరువాయి

ఆశలు చిగురించాయి. రాష్ట్రస్థాయితోపాటు ఉమ్మడి జిల్లా స్థాయిలో డీసీసీబీ, డీసీఎంఎస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ల పదవులను ఆశిస్తున్నారు.

పెరుగుతున్న ఆశావహులు

మూడో విడత నామినేటెడ్ పదవులను ఒకటి, రెండు రోజుల్లో భర్తీ చేసే అవకాశం ఉందని సంకేతాలు వెలువడడంతో కూటమి పార్టీల్లో రోజుకో కొత్త పేరు తెరపైకి వస్తున్నది. పలువురు నాయకులు తమ బయోడేటా (పార్టీలో ఎంత కాలం నుంచి వుంటున్నది, ఏయే పదవులు నిర్వహించింది, సామాజిక వర్గం, పార్టీకి చేసిన సేవలు.. వగైరా)ను పార్టీ అధిష్ఠానానికి పంపుతున్నారు. మాజీ ఎమ్మెల్యేలు గవిరెడ్డి రామానాయుడు, బోళెం ముత్యాలపాప, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశినాయుడు.. డీసీసీబీ, డీసీఎంస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవుల్లో ఏదో ఒకటి దక్కుతుందన్న ఆశతో వున్నారు. మూడో విడత నామినేటెడ్ పదవుల భర్తీలో తమకు అవకాశం ఇవ్వాలని ఇప్పటికే అధిష్ఠానాన్ని కోరినట్టు తెలిసింది. కాగా కూటమిలో భాగమైన జనసేన పార్టీ నాయకులు కూడా నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తనకు నామినేటెడ్ పదవి కేటాయించాలని ఇటీవల పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిసి కోరినట్టు సమాచారం.

ఇన్‌చార్జుల మార్పుపై వైసీపీ కసరత్తు

... 5వ పేజీ తరువాయి

మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు, బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, రావికమతం మండలానికి చెందిన కంచిపాటి జగన్నాథరావు పేర్లు పరిశీలించింది. అయితే వీరంతా మండలస్థాయి నేతలే కావడంతో చివరకు అమర్‌ను సమన్వయకర్తగా నియమించాలని నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. ఈ మేరకు మరో వారం రోజుల్లో అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలిసింది. మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడును తిరిగి మాడుగుల సమన్వయకర్తగా నియమించనున్నట్టు సమాచారం.

గోవాడ షుగర్స్ కార్మికుల ఆందోళన

... 5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ, వేతన బకాయిలు చెల్లించేంత వరకు కార్మికులు విధులకు హాజరుకారని స్పష్టం చేశారు.

చెరకు క్రషింగ్ మరింత జాప్యం

సంక్రాంతి పండుగ తరువాత రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభించడానికి యాజమాన్యం సిద్ధమైంది. కానీ బకాయి వేతనాల విషయమై కార్మికులు ఆందోళనకు దిగడంతో చివరి దశ పనుల్లో ప్రతిష్ఠంభన నెలకొంది. దీంతో శుక్రవారం ప్రారంభం కావలసిన చెరకు క్రషింగ్‌ను వాయిదా వేశారు. క్రషింగ్ ఎప్పుడు ప్రారంభం అవుతుందో ఫ్యాక్టరీవర్గాలు చెప్పలేకపోతున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది చెరకు క్రషింగ్ నెల రోజులకుపైగా ఆలస్యమైంది. క్రషింగ్ జరుగుతుందా? లేదా? అన్న సందేహాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, కూటమి నేతలు స్పందించి షుగర్‌లో పరిస్థితులను చక్కదిద్ది, సత్వరమే చెరకు క్రషింగ్ ప్రారంభించేలా చూడాలని రైతులు రైతులు కోరుతున్నారు.

సముద్ర తీరంలో ఇసుక దోపిడీ

... 5వ పేజీ తరువాయి

మట్టి, గ్రావెల్ బదులు సముద్రం ఇసుకను వినియోగిస్తున్నారు. ఇందుకోసం సముద్ర తీరంలో ఇసుక తిన్నెలను తవ్వేస్తూ ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్నారు. దూరాన్ని బట్టి ట్రాక్టర్ ఇసుక రూ.3,500 నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తున్నారు. అటవీ శాఖ పరిధిలోని సముద్ర తీరంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నప్పటికీ ఆ శాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి అయినా చూడడంలేదు. అటవీ శాఖతోపాటు రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు వెంటనే స్పందించి సముద్ర తీరంలో ఇసుక తవ్వకాలను కట్టడి చేయాలని, లేకపోతే తుఫాన్లు సంభవించినప్పుడు సముద్రం నీరు గ్రామాలను ముంచెత్తే ప్రమాదం వుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పశువుల బీమాకు బ్రేకులు

... 5వ పేజీ తరువాయి

చేయించడం మొదలుపెట్టారు. ఈ పథకం అమల్లోకి వచ్చిన తరువాత బీమా చేయించిన పశువుల్లో కొన్ని వివిధ కారణాల వల్ల మృత్యువాత పడగా, బాధిత రైతులకు బీమా కంపెనీ నుంచి నష్టపరిహారం అందింది. ఆ సొమ్ముతో రైతులు కొత్త పశువులను/జీవాలను కొనుగోలు చేసుకున్నారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పశువుల బీమా పథకాన్ని ఆపేసింది. దీంతో రైతులు తమ సొంత ఖర్చుతో బీమా చేయించుకోవాల్సి వచ్చింది. ఆర్థికంగా ఇది భారంగా వుండడంతో చిన్న, సన్నకారు రైతులు పశువులను బీమా చేయించుకోలేకపోయారు. ఈ విషయంలో ప్రభుత్వంపై వ్యతిరేకత రావడంతో ఎట్టకేలకే నాలుగేళ్ల తరువాత దిద్దుబాటు చర్యలు చేపట్టింది. 2023 జూన్ నుంచి పశువుల బీమా పథకాన్ని పునరుద్ధరించింది. ప్రీమియం గడువు ఏడాది కాగా గత ఏడాది జూన్‌తో గడువు ముగిసింది. ఇదే సమయంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వినతి మేరకు బీమా కంపెనీలు కొంతకాలం పొడిగించాయి. అయితే పశు బీమా పథకాన్ని మరింత పక్కాగా అమలు చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబరు నుంచి తాత్కాలికంగా నిలుపుదల చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) నుంచి పశు బీమా పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది.

'పేట' ప్రజలకు తీరని ట్రాఫిక్ కష్టాలు

▸▸ ఆక్రమణల జోలికి వెళ్లని అధికారులు
▸▸ పార్కింగ్ లేకున్నా షాపింగ్ కాంప్లెక్స్‌లకు అనుమతులు
▸▸ తాండవ వంతెన నుంచి తరచూ ట్రాఫిక్ జామ్
▸▸ నరకాన్ని చవిచూస్తున్న వాహనదారులు


తాండవ వంతెనపై ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

పాయకరావుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ వాసులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. రోడ్డు నిర్మించినా ఆక్రమణలు తొలగించకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం మధ్యాహ్నం తాండవ వంతెన నుంచి చిత్రమందిర్ థియేటర్ వరకు 200 మీటర్ల ప్రయాణానికి వాహనదారులకు అర్ధగంట సమయం పట్టింది.

పాయకరావుపేట పట్టణంలో తాండవ వంతెన నుంచి వై జంక్షన్ వరకు రెండు కిలోమీటర్లున్న మెయిన్‌రోడ్డుపై రాకపోకలు చేసేందుకు పట్టణ ప్రజలకు తలనొప్పిగా మారింది. పండుగలు, ముఖ్యమైన రోజుల్లో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతున్నది. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా చాలా చోట్ల వ్యాపారుల ఆక్రమణలతోపాటు ఆటోలు, ప్రైవేటు, స్కూల్ బస్సులు ఎక్కడ పడితే అక్కడే నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ నిలిచిపోతున్నది. ఈ సమస్య పరిష్కారానికి ఆక్రమణలు తొలగించి మెయిన్ రోడ్డు విస్తరణ ఒక్కటే మార్గమని గుర్తించారు. దీంతో 2012లో ఒకసారి, 2018లో మరోసారి మెయిన్‌రోడ్డు విస్తరణకు నిధులు విడుదలైనప్పటికీ జరగలేదు. అయితే 2023లో వైసీపీ ప్రభుత్వం మెయిన్‌రోడ్డు ఆక్రమణల జోలికి వెళ్లకుండా ప్రస్తుతం ఉన్న రోడ్డును బాగు చేయించి చేతులు దులుపుకుంది. దీంతో పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు షరా మామూలుగానే ఉన్నాయి. అలాగే మెయిన్‌రోడ్డును ఆనుకుని షాపింగ్ మాల్స్, షాపింగ్ కాంప్లెక్సుల నిర్మాణాలకు సెట్ బ్యాక్స్, పార్కింగ్ స్థలాలు లేకున్నా పంచాయతీ నుంచి వీఎంఆర్‌డీఏ వరకు అనుమతులు ఇచ్చేస్తుండడంతో పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపయ్యాయి. దీనిపై ఎట్టకేలకు స్పందించిన పంచాయతీ అధికారులు ఇప్పుడున్న మెయిన్ రోడ్డు నుంచి ఇరువైపులా ఎనిమిది అడుగులలోపు ఉన్న ఆక్రమణలు తాత్కాలికంగా తొలగించారు. అయినా పరిస్థితిలో మార్పు లేదు. సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలో వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. తాండవ వంతెన నుంచి మంగవరం రోడ్డు జంక్షన్ వరకు వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. దీనికితోడు స్థానిక గౌతమ్, చిత్రమందిర్ థియేటర్ల ఎదుట నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతునే ఉంది. ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేందుకు సరిపడా పోలీసులు ఉండకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా వాహనాలను నడుపుతున్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై పలుమార్లు పత్రికల్లో కథనాలు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు రోడ్డు విస్తరణపై పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాయకరావుపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఘనంగా శ్రీవారి తిరువీధి సేవ


పల్లకీపై స్వామివారి తిరువీధి సేవ

నక్కపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నుంచి ఉపమాక క్షేత్రంలో రాపత్తు అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి స్వామివారి గిరి ప్రదక్షిణ అనంతరం అర్ధరాత్రి 1 గంటల వరకూ మాడవీధుల్లో రాజాధిరాజ అలంకరణలో పుణ్యకోటి వాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తరువాత అర్ధరాత్రి 2గంటల సమయంలో రాపత్తు అధ్యయనోత్సవాల్లో భాగంగా రాత్రి తిరువీధి సేవలను ప్రారంభించారు. పుష్పమాలలు, పట్టుపీతాంబరాలతో ఉభయదేవేరులతో స్వామివారి ఉత్సమూర్తిని అలంకరించి, పల్లకీలో మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

కొత్త అల్లుడికి 108 రకాలతో వెండి గిన్నెల్లో భోజనం


కొత్త దంపతులకు వెండి గిన్నెల్లో 108 రకాల వంటకాలు వడ్డించిన దృశ్యం

ఎలమంచిలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి వచ్చే కొత్త అల్లుళ్లకు అత్తింటివారు ప్రత్యేక ఆతిథ్యం ఇస్తుంటారు. అదేవిధంగా కొత్త అల్లుడికి పట్టణంలోని భవనం వీధికి చెందిన బంగారం వ్యాపారి తన అల్లుడికి 108 వెండి గిన్నెల్లో 108 రకాల వంటకాలతో భోజనం వడ్డించారు. పట్టణానికి చెందిన బంగారు వ్యాపారి బండారు సురేష్, పద్మావతి దంపతులు ఇద్దరూ తమ కొత్త అల్లుడికి 108 వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. సురేష్ కుమార్తె సుస్మితకు, తరుణ్ సాయికుమార్‌తో వివాహం చేశారు. కొత్త అల్లుడిని సంక్రాంతికి ఆహ్వానించి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. 108 వెండి పాత్రల్లో పిండి వంటలతోపాటు వివిధ రాకలైన స్వీట్లు, శీతల పానీయాలు ఈ ప్రత్యేక విందులో ఉన్నాయి.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు


పెంటకోటలో పొలంబడి నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అపరాల సాగులో రైతులు సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి పి. ఆదినారాయణ అన్నారు. మండలంలోని పెంటకోట, మాసాహెబ్‌పేట గ్రామాలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు అపరాల సాగులో అధిక దిగుబడులు సాధించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు, సస్య రక్షణ చర్యలను వివరించారు. అనంతరం రైతు సేవాకేంద్రం వద్ద రైతులతో సమావేశం నిర్వహించి, ప్రకృతి వ్యవసాయం, ప్రభుత్వం అందించే సబ్సిడీలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది సతీష్, అజయ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రబీ వరిలో పొటాష్ రెండు సార్లు వేసుకోవాలి


దిమిలిలో రైతులకు సూచనలు చేస్తున్న ఏవో సుమంత

రాంబిల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రబీ వరి సాగులో పొటాష్ ఎరువును రెండు సార్లు వేసుకోవాలని వ్యవసాయాధికారిణి సి.సుమంత అన్నారు. గురువారం ఆమె మండలంలోని దిమిలి, కట్టుబోలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుక్కిలో 15 కేజీలు పొటాష్‌ను, వరి పొట్టదశలో మరో 15 కేజీలు పొటాష్‌ను వేయడం ద్వారా పైరు ఏపుగా పెరిగి తాలు గింజలు రాకుండా ఉంటుందన్నారు. అపరాలు సాగులో యాజమాన్య పద్ధతులను రైతులకు తెలియజేశారు. పీఎం కిసాన్ లబ్ధిదారుల వెరిఫికేషన్‌లో రైతులు ఈకేవైసీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఆర్వోలు ఈ.మంగారావు, వై.సన్యాసినాయుడు, పంచాయతీ సెక్రటరీ కె.అమ్మాజీ, వీఏఏలు ప్రశాంతి, మేఘన, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


రాంబిల్లి: దిమిలి భాగవతుల సోమన్న జడ్పీ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వపు విద్యార్థులు

ఎలమంచిలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ సోమలింగపాలెంలోని జడ్పీ హైస్కూల్‌లో 2001-2002 సంవత్సరం పదో తరగతి పూర్వవిద్యార్థులంతా కలుసుకుని సందడి చేశారు. గురువారం సోమలింగపాలెం స్కూలు ఆవరణలో ఈ పూర్వ విద్యార్థులంతా కలిసి స్కూలు పరిసరాల్లో ఆనందోత్సాహాలతో గడిపారు. హైస్కూల్ అభివృద్ధిలో తామంతా పాలు పంచుకునేందుకు వీరంతా తీర్మానించుకున్నట్టు పూర్వ విద్యార్థి మోహన్ తెలిపారు. వారంతా భార్య, పిల్లలతోపాటు హాజరై నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఒకరి యోగక్షేమాలను మరొకరు తెలుసుకున్నారు.

రాంబిల్లిలో..

మండలంలోని దిమిలిలో భాగవతుల సోమన్న జడ్పీ హైస్కూల్‌లో 2004లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు గురువారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు.


ఎలమంచిలి: సోమలింగపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకున్నారు. చదువుకున్న రోజుల్లో పాత జ్ఞాపకాలను, ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. ఎవరు ఏ ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారో ఒకరినొకరు అడిగి తెలుసుకొని సంతోషం వ్యక్తం చేశారు. సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు.

ఉపాధి హామీలో పశుగ్రాసం సాగు

▸▸ మండల పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్



మునగపాక, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పశుగ్రాసం సాగుకు అవకాశం ఉందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి ఎల్.ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఉపాధి హామీ పథకంలో 10 నుంచి 50 సెంట్లు విస్తీర్ణంలో పశుగ్రాసం సాగు చేసుకోవచ్చునని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న రైతుకు కనిష్ఠంగా 10 సెంట్లలో సాగు చేస్తే కూలీల వేతనంగా రూ.3వేలు, మెటీరియల్ ఖర్చుగా రూ.3,599 కలిపి రూ.6,599 ఆదాయం పొందవచ్చునని చెప్పారు. గరిష్ఠంగా 50 సెంట్లు సాగు చేస్తే కూలీల వేతనంగా రూ.15వేలు, మెటీరియల్ ఖర్చుగా రూ.17,992 కలిపి రూ.32,992 పొందవచ్చునని తెలిపారు. సాగు గడువు ఏడాదిగా ఉంటుందన్నారు. చాలా మంది రైతులకు ఈ పథకం గురించి తెలియక వినియోగించుకోలేకపోతున్నారని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు స్థానిక పశు వైద్య కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు పొందవచ్చునని చెప్పారు. దరఖాస్తుతోపాటు ఉపాధి హామీ జాబ్ కార్డు, 1బి, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, రేషన్ కార్డు జెరాక్సులు జత చేయాలన్నారు.

అందలాపల్లిలో భరతమాత పూజలు

అచ్యుతాపురం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపాలెం-అందలాపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం భరతమాత పూజలు చేశారు. ఈ సందర్భంగా సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బీవీ రమణ మాట్లాడుతూ ప్రతి పౌరుడూ దేశభక్తిని కలిగి మాతృభూమి రుణాన్ని తీర్చుకోవాలన్నారు. భారతీయునిగా జన్మించడం అదృష్టంగా భావించి, భరతమాతను గౌరించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, మహిళా కన్వీనర్ బీశెట్టి దేవి, వెంకట్రావ్, ఆదిసూరి, సన్యాసిరావు, శ్రీలక్ష్మి, వరలక్ష్మి, కాండ్రేగుల రమణ, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఖాజీపాలెంలో పీలా వారి కోటల తీర్థం

అచ్యుతాపురం రూరల్, జనవరి 16, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపాలెంలో పీలావారి కోటల తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సంప్రదాయ దుస్తులతో అలంకరణ, ముగ్గుల పోటీలు, క్రీడల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామంలో ఉండే చిన్నారులతో కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమం గ్రామ పెద్దలు పీలా తులసీరామ్, పీలా సందీప్, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో తీర్థాల సందడి

ఎస్.రాయవరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరాపల్లి, సైతారుపేట, పెట్టుగోళ్లపల్లి గ్రామాల్లో గురువారం తీర్థాలు సందడిగా జరిగాయి. స్థానికులు ఎంతో ఉత్సాహంగా తరలివెళ్లి తీర్థంలో ఏర్పాటుచేసిన దుకాణాల వద్ద కొనుగోలు చేశారు. ఆయా గ్రామాల్లో అమ్మవారి ఆలయాల్లో పూజలు చేశారు.

మీనా కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పంచకర్ల పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

ఎలమంచిలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన కొక్కిరాపల్లి మాజీ కౌన్సిలర్ మజ్జి మీనా కుటుంబ సభ్యులను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌కుమార్ గురువారం పరామర్శించారు. మజ్జి రాంబాబు, కుమారులు వీరబాబు, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణలను ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. అంతకు ముందుకు గొల్లలపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నేత నమ్మి రమణ కుమార్తె రజస్వల కార్యక్రమానికి హాజరు కాలేని కారణంగా ఆయనను పంచకర్ల కలిశారు. పంచకర్ల వెంట స్థానిక కూటమి నేతలు ఉన్నారు.

పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు గురువులు


పిల్లల చదువుపై ఆరా తీస్తున్న ఉపాధ్యాయుడు వెంకటరమణ

నక్కపల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు సెలవుల్లో సమయం వృథా చేయకుండా, వారి దృష్టి అంతా చదువుపై పెట్టేలా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. మండలంలోని చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు వై.వెంకటరమణ గురువారం టెన్త్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, వారు ఎలా చదువుతున్నారో పరిశీలించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా నేరుగా పిల్లల ఇంటికి వెళ్లి వారి పఠనా సామర్థ్యం, ఇతర అంశాలపై తల్లిదండ్రులతో మాట్లాడి, వారికి పలు సూచనలు చేశారు.

గొరపూడి కొండ వద్ద పులి సంచారంపై వదంతులు

▸▸ పులి కాదు నక్క అని చెప్పిన అటవీ శాఖ అధికారులు

రాంబిల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరపూడి గ్రామ సమీపంలోని కొండ వద్ద గురువారం సాయంత్రం పులి కనిపించిందంటూ వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం జరగడంతో స్థానికులు, సమీప గ్రామాల ప్రజలు హడలిపోయారు. గొరపూడి గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండ వద్ద పులి కూర్చొని ఉన్నట్టు ఫొటోను వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడంతో ప్రజలు భయపడిపోయారు. ఆ కొండ సమీపంలోని తోటల్లో పశువులు ఉన్నాయని, వాటికి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న గొరపూడిలోని టీడీపీ నాయకుడు లాలం తాతబాబు ఫారెస్టు అధికారి రమణకు విషయాన్ని చెప్పి, వాట్సాప్‌లో వచ్చిన ఫొటో పంపించారు. ఆయన పరిశీలించి అది పులి కాదని, నక్క అని చెప్పడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. శుక్రవారం తాము వచ్చి పరిశీలిస్తామని రమణ తెలిపారు.

ఇంటర్వ్యూ..

గంజాయి రవాణాపై నిఘా

సీఐ కుమారస్వామి



(ఆంధ్రజ్యోతి-నక్కపల్లి)

ప్రశ్న: గంజాయి నిరోధానికి ఏ చర్యలు చేపడుతున్నారు?

జ: ఏజెన్సీ నుంచి హైవే మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. అందుకే వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశాం. రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నాం. డబ్బుకు ఆశపడి గంజాయి రవాణా చేసి, కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు నాశనమవుతాయి.

ప్రశ్న: హైవేపై ప్రమాదాల నివారణకు ఏ చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు: ఇటీవల వేంపాడు, ఉద్దండపురం, గొడిచెర్ల, హైవే జంక్షన్ల వద్ద ప్రమాదాలపై హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశాం. రాంగ్ రూట్‌లో వాహనాలు నడపకుండా, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదంటూ గ్రామాల్లో విస్తృతంగా అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. పలు జంక్షన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

ప్రశ్న: బల్క్‌డ్రగ్ పోరాటంలో ఎంతమందిపై కేసులు నమోదు చేశారు ?

జవాబు: ప్రశాంతంగా ఆందోళన చేసే వారిపై కేసులు పెట్టలేదు. ఇటీవల ప్రధాని బల్క్‌డ్రగ్ పార్కుకు వర్చువల్ శంకుస్థాపన చేసిన రోజు పోలీస్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన 8 మందిపై మాత్రమే కేసులు నమోదు చేశాం.

ప్రశ్న: పెండింగ్ కేసులపై దర్యాప్తు ఎలా సాగుతోంది?

జవాబు: సర్కిల్ పరిధిలో పెండింగ్ కేసులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇటీవల న్యాయంపూడిలో ఒక ఇంటిలో దొంగతనం జరిగింది. ఈ కేసు మిస్టరీని కూడా ఈ వారంలో ఛేదిస్తాం.

ప్రశ్న: దొంగతనాల నివారణకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు ?

జవాబు: గతంతో పోల్చుకుంటే దొంగతనాల తీవ్రత బాగా తగ్గింది. దీనిక్కారణం మనకున్న టెక్నాలజీ. సీసీ కెమెరాలతో ఏ దొంగతనం జరిగినా వెంటనే పట్టుకునే అవకాశం వుంది. మొబైల్ ట్రాకింగ్ ద్వారా కూడా పలు కేసుల్లో నేరస్తులను పట్టుకుంటున్నాం. ముఖ్యంగా ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలుచేయడం వల్ల కొందరు పాత నేరస్తులు దొంగతనాల జోలికి వెళ్లడం లేదు.

కొత్తపేటలో పైడితల్లి తీర్థం

రాంబిల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామంలో పైడితల్లి తీర్థాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సుమారు 8 గ్రామాల ఆరాధ్య దైవమైన పైడితల్లిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించి, పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. మొక్కులను చెల్లించుకున్నారు. నిర్వాహకులు అమ్మవారి తీర్థ, ప్రసాదాలను భక్తులకు అందజేశారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా నంది ఉత్సవం

నక్కపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ముక్కనుమ పండుగ సందర్భంగా నంది ఉత్సవం ఘనంగా జరిగింది. నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో వున్న నందీశ్వరుడి మందిరాన్ని పలువురు భక్తులు దర్శించుకున్నారు. నంది విగ్రహానికి పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. నక్కపల్లిలో జాతర జరిగింది. గ్రామ పెద్దలు, కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని గ్రామాలు

అచ్యుతాపురం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెదురువాడ ఫీడర్ పరిధిలో చెట్లు తొలగించే ప్రక్రియలో భాగంగా వెదురువాడ, గొర్లిధర్మవరం, దిబ్బపాలెం, మోసయ్యపేట, అచ్యుతాపురం, మెట్టధర్మవరం గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

మునగపాక, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సీఐటీయూ నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలో వెంకటాపురంలో గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో రేబాక బాబూరావు, బలిరెడ్డి సింహాచలం, రాంబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

కోడిపందేలు, బల్లాటలపై పోలీసుల దాడి

అచ్యుతాపురం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పవరం, ఖాజీపాలెం గ్రామాలలో గురువారం కోడి పందేలు, బల్లాట స్థావరాలపై దాడి చేసినట్టు సీఐ నమ్మి గణేష్ తెలిపారు. అందిన సమాచారం మేరకు ఉప్పవరంలో కోడిపందేల స్థావరంపై తమ బృందంతో దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి 830 రూపాయలు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అలాగే ఖాజీపాలెం గ్రామ శివార్లలో బల్లాటపై దాడి చేసి ఒక వ్యక్తి వెయ్యి రూపాయలను పట్టుకున్నట్టు ఆయన తెలిపారు. మిగిలిన వారు పరారైనట్లు తెలిపారు.

అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి

▸ టీడీపీ శ్రేణులకు పార్టీ జిల్లా అధ్యక్షుడు 'బత్తుల' పిలుపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాతయ్యబాబు.., చిత్రంలో పీలా గోవింద

అనకాపల్లి టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని ఈ నెల 18న నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణలు పిలుపునిచ్చారు. గురువారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్టీఆర్ వైద్యాలయం, ఎన్టీఆర్ జంక్షన్‌లలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాలు, పేదలకు వస్త్రదానం, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ వంటివి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పీవీజీ కుమార్, మళ్ల సురేంద్ర, కాయల మురళి, కోట్ని బాలాజీ, బీఎస్ఎంకే జోగినాయుడు, బొలిశెట్టి శ్రీనివాసరావు, గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలాడుతున్న 13 మందిపై కేసు నమోదు

సబ్బవరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం, మొగలిపురం, బలిజపాలెం, గాలిభీమవరం గ్రామాల్లో కనుమ సందర్భంగా బుధవారం రాత్రి కోడి పందేలు ఆడుతున్న 13 మందిపై కేసులు నమోదు చేశామని సీఐ పిన్నింటి రమణ తెలిపారు. వారి నుంచి 12 కోడి పుంజులు స్వాధీనం చేసుకొన్నామన్నారు. అలాగే సబ్బవరంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని గురువారం అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు.

'గోవాడ షుగర్స్ కార్మికులకు జీతాలు చెల్లించాలి'

అనకాపల్లి టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయి జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. ఇక్కడి యూనియన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఫ్యాక్టరీలో పర్మినెంట్, ఎస్ఎంఆర్, కాంట్రాక్టు కార్మికులు 352 మంది జీతాలు లేక అల్లాడిపోతున్నారన్నారు. పండుగ పూట కార్మికులు కుటుంబాలతో ఇబ్బందులు పడాల్సి వచ్చిందని వాపోయారు. ఈ విషయంలో ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్యం చొరవ తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

వెదురుపర్తిలో 'విద్యార్థి మేలుకో'



విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పాఠాలను బోధిస్తున్న హెచ్‌ఎం మూర్తి

కశింకోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వెదురుపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు ప్రధానోపాధ్యాయుడు వి.ఎస్.మూర్తి గురువారం వెళ్లారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను వివరించారు. అనంతరం వారి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పరీక్షలకు పిల్లలను ఏ విధంగా సిద్ధం చేయాలో వివరించారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అంతా కృషి చేయాల్సిందిగా కోరారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కశింకోట సబ్ స్టేషన్‌లో 33కేవీ మరమ్మతుల కారణంగా కొత్తూరు సెక్షన్ కార్యాలయ పరిధిలో గల కొత్తూరు, మూలపేట, సత్యనారాయణపురం, సంపతిపురం, వేట జంగాలపాలెం, కూండ్రం, కుంచంగి, రొంగలివానిపాలెం, పిసినికాడ గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. వినియోగదారులంతా సహకరించాల్సిందిగా కోరారు.

విఘ్నేశ్వర ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళం



కమిటీకి చెక్కు అందజేస్తున్న ముత్యాలనాయుడు

సబ్బవరం, జనవరం 16 : మండల కేంద్రం సబ్బవరంలో పురాతన శివాలయం పక్కన నూతనంగా నిర్మించనున్న విఘ్నేశ్వర ఆలయానికి మండలంలోని రావలమ్మపాలెం గ్రామానికి చెందిన గొంప ముత్యాల నాయుడు ఐదు లక్షల నూట పదహారు రూపాయలను గురువారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దంగేటి నాగేశ్వరరావు, ప్రకాశ్, గెడ్డం కృష్ణ, కోరాడ శ్రీను, బర్ల రమణ, కొల్లి కృష్ణ, బేతిన శ్రీనివాసరావు ఆయనను అభినందించారు.

పకడ్బందీగా రహదారి భద్రత మాసోత్సవాలు

▸ వివిధ శాఖల అధికారుల సమీక్షలో జేసీ జాహ్నవి ఆదేశం ▸ నెల రోజుల పాటు చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం



జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న జేసీ జాహ్నవి తదితరులు

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఇందుకు సంబంధించి రవాణా, పోలీసు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు చాలా ముఖ్యమైనవన్నారు. ప్రమాదాల వల్ల ఒక ప్రాణాన్ని పోగొట్టుకున్నా తిరిగి రాని పరిస్థితి అన్నారు. ఇతరుల పొరపాటు వల్ల ప్రాణాలు కోల్పోవచ్చని, ప్రమాదాలు జరగకుండా సురక్షిత డ్రైవింగ్‌పై అందరికీ విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. గురువారం ప్రారంభమైన ఈ మాసోత్సవాలు ఫిబ్రవరి 15వ తేదీ వరకు వివిధ కార్యక్రమాల ద్వారా నిర్వహించాలన్నారు. 17న రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు, డ్రైవింగ్ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్లు, రిటైర్డ్ ఏపీఎస్ ఆర్టీసీ సిబ్బందితో వలంటీర్లను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. 18 నుంచి 21వ తేదీ వరకు మద్యం సేవించి వాహనం నడిపే వారిని గుర్తించడం, అధిక వేగంతో నడిపే వాహనాలను స్పీడ్ గన్‌తో గుర్తించడం, హెల్మెట్ లేకుండా, సీటు బెల్ట్ లేకుండా వాహనం నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ మొదలైన వాటిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. 22, 23 తేదీల్లో జిల్లాలోని జాతీయ, రాష్ట్ర రహదారులలో గుర్తించిన బ్లాక్ స్పాట్లలో జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయడం, అక్కడ తగిన భద్రత చర్యలు చేపట్టడం చేపట్టాలని పేర్కొన్నారు. అనకాపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కూడా బ్లాక్‌స్పాట్లలో పరిశీలన చేయాలన్నారు. 24న డ్రైవర్లకు హెల్త్ చెకప్ చేయించడం, 25న అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, 26, 27 తేదీల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి వాక్‌థాన్‌లు నిర్వహించడం, 30, 31 తేదీల్లో బైక్ ర్యాలీలు నిర్వహించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వచ్చే నెల 15వ తేదీ వరకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖాధికారి జి.మనోహర్, అనకాపల్లి ట్రాఫిక్ సీఐ ఎం. వెంకటనారాయణ, మోటార్ వెహికల్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, రవాణా, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల రహిత డిపోగా అనకాపల్లికి గుర్తింపు తేవాలి

▸ డ్రైవర్లు, కండక్టర్లకు పోలీస్, రవాణా అధికారులు సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ సంతోష్‌కుమార్

అనకాపల్లి టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడిపితే ఎటువంటి ప్రమాదాలు జరగవని పట్టణ ఎస్ఐ సంతోష్‌కుమార్ అన్నారు. ఇక్కడి ఆర్టీసీ డిపోలో గురువారం సాయంత్రం రహదారి భద్రతా మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రమాదాల రహిత డిపోగా అనకాపల్లికి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. డ్రైవర్లు బస్సులు నడిపేటప్పుడు అజాగ్రత్తగా ఉండకుండా, ముఖ్యంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. డీపీటీవో కె.పద్మావతి మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లు జాగ్రత్తలు పాటించాలన్నారు. బస్సు నడిపేటప్పుడు అందులో ఉన్న ప్రయాణికులను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా విధులకు హాజరయ్యేటప్పుడు ఎంతో ప్రశాంతంగా రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎం రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



జనసేన కార్యాలయంలో ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

25న గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

▸ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొణతాల

కొత్తూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఈ నెల 25న జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ గురువారం ఇక్కడ ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావునాయుడు ఉత్సవ విశేషాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ ఏడాది 37 భారీ స్టేజీలు, కోల్‌కతా వారి లైటింగ్, బాణసంచా, ఉచిత వైద్య శిబిరం తదితరాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కోశాధికారి కొణతాల నూకమహాలక్ష్మీనాయుడు, సంయుక్త కార్యదర్శి పి.వి.రమణ, జనసేన పార్టీ నాయకులు పీలా నాగశ్రీను, కొణతాల మాధవ, దాడి బుజ్జి, ప్రతినిధులు విశ్వేశ్వరరావు, రాజేష్, రవి, మురళి, కొణతాల ప్రసాద్, భీశెట్టి ప్రసన్న, మురళీ తదితరులు పాల్గొన్నారు.

శారదానగర్‌లో ఎటుచూసినా చెత్తే



శారదానగర్ ప్రధాన రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

కొత్తూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి శారదానగర్‌లోని పలు వీధుల్లో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయింది. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో మూడు రోజులుగా చెత్తను తరలించేవారు కరువయ్యారు. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. దీనికితోడు ఆయా కుప్పల్లో పందులు, వీధి కుక్కలు వంటివి చేరి చిందరవందర చేస్తుండడంతో వాతావరణం మరింత పాడవుతోంది. కొందరు స్థానికులు సైతం ఇంట్లో వ్యర్థాలను సైతం ప్రధాన రోడ్డుపక్కనే ఇష్టారాజ్యండా పడేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు ముందు ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాల్సిందిగా పలువురు కోరుతున్నారు.



శారదానగర్‌లో రోడ్డు పక్కన...

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేత

అనకాపల్లి టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలను ఆర్థికంగా ఆదుకోవడానికే సీఎం సహాయ నిధిని అందజేస్తున్నారని అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. గురువారం తన కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ఆరుగురికి మూడు లక్షల తొంభై వేల రూపాయల సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏనాడు సీఎం సహాయ నిధి కింద పేదలు అనారోగ్యంతో బాధపడినప్పుడు ఇవ్వలేదని ఆరోపించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా వీధి దీపాల నిర్వహణ

లంకెలపాలెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి లంకెలపాలెం, శ్రీరామ్‌నగర్, వినాయక నగర్ పరిసర ప్రాంతాల్లో వీధిలైట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. పలుచోట్ల లైట్లు వెలగక ఇబ్బందులు పడుతుంటే.., మరికొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు పగలు, రాత్రి అన్న తేడా లేకుండా నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. వార్డు పరిధిలో తొంభై శాతం లైట్లు వెలగడం లేదు. మిగిలిన పది శాతం లైట్లు రేయింబవళ్లు వెలుగుతూనే ఉన్నాయని పలువురు వాపోతున్నారు. ముఖ్యంగా ఫార్మాసిటీ పునరావాస కాలనీ, వినాయక నగర్, శ్రీరామ్‌నగర్, గంగిరెడ్ల కాలనీ ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. వీధి లైట్లు నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు మండి పడుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

ఇంటర్వ్యూ..

అనకాపల్లిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

▸ ఎంవీ నారాయణ, ట్రాఫిక్ సీఐ



జిల్లా కేంద్రం అనకాపల్లిలో ట్రాఫిక్ ప్రధాన సమస్యగా మారుతుంది. వివిధ గ్రామాల నుంచి ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెటింగ్ తదితరాలకు నిత్యం పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కార చర్యలను సీఐ వివరించారు.

ప్రశ్న: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి...?

జవాబు: అనకాపల్లిలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా కట్టడి చేశాం. వీటిని తుమ్మపాల ఏలేరు కాలువ పక్క నుంచి, అలాగే ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ నుంచి జాతీయ రహదారి మీదుగా మళ్లించాం. సిబ్బందిని పలుచోట్ల ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : ఆటోలు నెహ్రూచౌక్‌కు రావడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ సమస్య అధిగమించడం ఎలా..?

జవాబు : ఆటోలు నెహ్రూచౌక్‌కు రాకుండా చూస్తున్నాం. కశింకోట వైపు నుంచి వచ్చే ఆటోలు నరసింగరావుపేటకు వెళ్లే మార్గంలో ఆపేస్తున్నాం. చోడవరం నుంచి వచ్చే ఆటోలు జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద మళ్లిస్తున్నాం. విశాఖ మార్గం నుంచి వచ్చే ఆటోలను బస్టాప్ వద్ద మళ్లిస్తున్నాం. ఎప్పటికప్పుడు ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : కూరగాయల మార్కెట్ వద్ద ట్రాఫిక్‌ను ఎలా చక్కదిద్దుతున్నారు..?

జవాబు : కూరగాయల మార్కెట్, ఎన్టీఆర్ వైద్యాలయం జంక్షన్‌లలో ఉదయం వేళల్లో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమౌతుంది. సిబ్బందిని అప్రమత్తం చేసి ఈ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. రోడ్లపై వ్యాపారాలు చేసే చిల్లర వర్తకులకు రహదారి చివరన మార్కింగ్ ఇచ్చి వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ప్రయాణికుల సమస్యను దృష్టిలో పెట్టుకొని వారు సహకరించాలి. - అనకాపల్లి టౌన్

'సింహాద్రి' ఆస్పత్రిలో ఆ పంచాయతీల ప్రజలకు వైద్య సేవలందించాలి

పరవాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన ఆస్పత్రిలో వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం పంచాయతీల పరిధి ప్రజలకు వైద్య సేవలందించేందుకు అనుమతి ఇవ్వాలని టీడీపీ నాయకుడు కూండ్రపు మధు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయా పంచాయతీల ప్రజలు అత్యవసర వైద్యం పొందాలంటే సుమారు 25 కిలో మీటర్లు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఇటువంటి సమయంలో పలువురు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. సుమారు 20వేల మంది జనాభా ఆయా పంచాయతీల్లో నివాసం ఉంటున్నట్టు చెప్పారు. వీరిలో ఎవరికైనా అత్యవసర చికిత్స అవసరమైతే గాజువాక, విశాఖపట్నం, అనకాపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని వివరించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పైన పేర్కొన్న నాలుగు పంచాయతీల పరిధి ప్రజలకు సింహాద్రి ఎన్టీపీసీ ఆస్పత్రిలో వైద్య సేవలందించేలా చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గొబ్బూరులో గైరమ్మ చెరువు కబ్జాపై ఫిర్యాదు

కశింకోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : గొబ్బూరులో ఉన్న రామ్‌కో సిమెంటు కంపెనీ భూ ఆక్రమణకు పాల్పడినట్టు సదరు గ్రామానికి చెందిన బుద్ద వెంకటరమణ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 10-1లో ఉన్న కిత్తయ్య చెరువు 3.26 ఎకరాల్లో కొంత భాగాన్ని ఆక్రమించినట్టు అందులో పేర్కొన్నారు. చెరువుకు వచ్చే మామిడివాడ కాలువ ఎకరా భూమిని ఆక్రమించుకొని కాలువలు లేకుండా కప్పివేశారని ఆరోపించారు.

ఊరూరా... ఘనంగా రాములవారి తీర్థం



గవరపాలెం సంతబయలులో పెదరామస్వామి తీర్థం దృశ్యం

అనకాపల్లి టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పల్లెలు, పట్టణాల్లో తీర్థాల సందడి ఆరంభమైంది. గత రెండు రోజులుగా పలుచోట్ల జరుగుతున్న ఈ వేడుకలకు భారీగా జనం తరలి వస్తుండడంతో ఆయా ప్రాంతాలు కోలాహలంగా మారుతున్నాయి. గురువారం పట్టణంలోని గవరపాలెం సంతబయలులో పెదరామస్వామి తీర్థం ఘనంగా జరిగింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు గవరపాలెంలోని ప్రజలు కుటుంబ సమేతంగా విచ్చేశారు. సీతారాములను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

మార్టూరులో జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందేలు

తుమ్మపాల : మార్టూరులో సీతారాముల తీర్థం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఇందులో భాగంగా జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందేలు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ప్రారంభించారు. ప్రథమ బహుమతి చోడవరం మండలం నరసాపురం, ద్వితీయ బహుమతి లక్కవరం, తృతీయ బహుమతి సింహాద్రిపురం గ్రామాలకు చెందిన ఎడ్ల బండ్లు దక్కించుకున్నాయి. వీటి యజమానులకు పోటీల నిర్వాహకులు నగదుతో పాటు షీల్డ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పరవాడ : మండల కేంద్రం పరవాడలో గురువారం సీతారాముల తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు జరిపారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులతో పాటు సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం నుంచి తీర్థంలో ప్రారంభమైన కోలాటం, సాముగరిడి, చిడతలు, చిటికెల భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



పరవాడలోని సీతారాముల తీర్థంలో కోలాటం



మార్టూరులో ఎడ్ల పరుగు పందేలను ప్రారంభిస్తున్న పెద్దలు

లంకెలపాలెం : జీవీఎంసీ 85వ వార్డు పరిధి మంత్రిపాలెం రామాలయం వద్ద గురువారం సీతారాముల పరసను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు ఆదర్శ దంపతులకు పూజలు జరిపారు. సాయంత్రం కమిటీ ఆధ్వర్యంలో పరసను నిర్వహించారు. కోలాటాలు, తప్పెడగుళ్ల, సాము గరిడీలు, బొమ్మల కొలువులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు పచ్చికోరు రమణమూర్తి, శనివాడ సత్తిబాబు, జెర్రిపోతుల నీలబాబు, సేనాపతి గంగరాజు, రాజు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరం శివారు పెదనాయుడు పాలెం, బంగారమ్మపాలెం, అనకపల్లి శివారు ఎరుకునాయుడుపాలెం గ్రామాల్లో సీతారామల తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. బంగారమ్మపాలెంలో మహిళలకు కుర్చీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. సర్పంచ్ దాడి లావణ్య, మాజీ ఎంపీటీసీ దొడ్డి అరుణ, దాడి కన్నంనాయుడు, దొడ్డి ప్రకాశ్, గొర్లి శ్రీను, బుజ్జి, సతీష్, కేవీ సత్యనారాయణ, గొళ్ల రమణ, నాగేంద్ర, కర్రి సత్యనారాయణ, కిల్లి శ్రీనివాసరావు, రాజుకోటి తదితరులు పాల్గొన్నారు.

AJC CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, **JSLINA KANDKATLA** (Old Name), D/o. Kandikatla Ramesh Babu, R/o. 2-59, Gudimula, Sakhinetipalli, Dr. B.R.Ambedkar Kona Seema. Change my name from **JSLINA KANDKATLA** (Old Name) to **KANDIKATLA JASLINA** (New Name). Henceforth I am being called as **KANDIKATLA JASLINA** (New Name) for all purposes.
AJV_ 230796

CHANGE OF NAME

I, **KOYILADA PARVATI** (Old Name), W/o. Koilada Govinda Rao, resident of D.No. 65-1-109c, Srinivasnagar, Sriharipuram, Malkapuram (P.O), Visakhapatnam. Change my name as **KOILADA PARVATI** (New Name) W/o. Koilada Govinda Rao. Hereinafter my name is known as **KOILADA PARVATI** (New Name) W/o. Koilada Govinda Rao.

CHANGE OF NAME

I, **KOYILADA GOVINDA RAO** (Old Name), S/o. Late. Koilada Govinda Rao, resident of D.No. 65-1-109c, Srinivasnagar, Sriharipuram, Malkapuram (P.O), Visakhapatnam. Change my name as **KOILADA GOVINDA RAO** (New Name) W/o. Koilada Govinda Rao. Hereinafter my name is known as **KOILADA GOVINDA RAO** (New Name) S/o. Late. Koilada Govinda Rao.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093

అస్తవ్యస్తంగా నాలుగు రోడ్ల కూడలి

- అధ్వానంగా ముంచంగిపుట్టులో డ్రైనేజీ వ్యవస్థ
- వీధుల్లో కానరాని సీసీ రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



నాలుగు రోడ్ల కూడలిపై పారుతున్న వర్షం నీరు (ఫైల్‌ఫొటో)

ముంచంగిపుట్టు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముంచంగిపుట్టులో డ్రైనేజీ వ్యవస్థ అవస్తవ్యస్తంగా ఉంది. దీంతో చిన్నపాటి వర్షం పడినా ప్రధాన జంక్షన్‌తో పాటు ఇరువైపులా కాలువలు అధ్వానంగా మారి, స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా కూడలిలో డ్రైనేజీ సదుపాయంలేక ఈ సమస్య నెలకొంటోంది. కూడలినుంచి వెటర్నరీ ఆసుపత్రికి వెళ్లే మార్గంలో ఇరువైపులా డ్రైనేజీలు దెబ్బతిన్నాయి. అలాగే, జీసీసీ గొడౌన్‌కు వెళ్లే మార్గంలో అరకొర మరమ్మతులు చేపట్టారు. దీంతో రహదారిపైనే చెత్త, మురుగునీరు పేరుకుపోతోంది. అలాగే, వీధుల్లో సైతం డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో స్థానికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. అధికారులు కనీసం దృష్టి సారించకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. పలుచోట్ల మురుగు నీరు రహదారులపైనిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. సంత బయలు ప్రాంతంలో మరీ అధ్వానంగా మారింది. పాదచారులు ముక్కు మూసుకోవాల్సి వెళ్లాల్సి వస్తోంది. కొద్ది రోజుల కిందట కురిసిన వర్షాలకు దోమ లు బెడద పెరిగిపోంది. దీంతో పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు అధికారులు చొరవ చూపాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.



మురుగుకాలువ దుస్థితి

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు: డీఎల్‌పీవో

చింతపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ పరిధిలో రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శులను డీఎల్‌పీవో పీఎస్ కుమార్ ఆదేశించారు. గురువారం లంబసింగి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామంలో ఓ ఇళ్ల స్థలం వివాదంపై లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాలను పెద్దల సమక్షంలో విచారణ చేపట్టారు. అనంతరం డీఎల్‌పీవో మాట్లాడుతూ వేసవి సమీపిస్తుండడంతో గిరిజన గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో అందుబాటులోనున్న తాగునీటి పథకాలు, బోరుల వివరాలు, తాజా పరిస్థితిపై నివేదకలు ఇవ్వాలని కార్యదర్శులకు సూచించామన్నారు. తాగునీటి పథకాలు మరమ్మతులకు గురైతే వెంటనే బాగుచేయాలన్నారు. పంచాయతీల పరిధిలో స్వర్ణ పంచాయతీ డేటా నమోదు, ఎన్‌పీసీఐ బ్యాంకు లింకేజీ, హౌస్ హోల్డ్ సర్వే, జియోట్యాంగ్ వేగవంతం చేయాలన్నారు. గ్రామ సచివాలయం ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పర్యాటక ప్రాంతాలైన లంబసింగి, తాజంగి, పెదబరడ పంచాయతీల పరిధిలో పారిశుధ్యం మెరుగు కోసం అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



లంబసింగిలో స్థలవివాదంపై విచారణ చేపడుతున్న డీఎల్‌పీవో పీఎస్ కుమార్

నూతన ఏఎస్పీ నవజ్యోతి మిశ్రాకు శుభాకాంక్షలు

చింతపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి సబ్ డివిజన్ నూతన అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు(ఏఎస్పీ) బాధ్యతలు స్వీకరించిన నవ జ్యోతి మిశ్రాని గురువారం పలువురు పోలీసు అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఎంవీ రమణ, పి. వర ప్రసాద్, ఎం. వినోద్ బాబు, ఎస్సైలు అప్పలనూరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఏఎస్పీకి శుభాకాంక్షలు తెలుపుతున్న సబ్ డివిజన్ సీఐ, ఎస్సైలు

అనాథ చిన్నారులకు సాయం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన డిప్యూటీ తహసీల్దార్



ఆర్థిక సహాయంతో పాటు దుస్తులు అందిస్తున్న డీటీ సత్యనారాయణ

కొయ్యూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి) అనాథ చిన్నారులకు సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ. వివరాలివి.. మంప పంచాయతీ శివారు తుమ్మలబంధ గ్రామానికి చెందిన సెగ్గే శివ గంగ, (14), దేవిదుర్గ (12) విష్ణు (10) చిన్నారుల తల్లితండ్రులు సెగ్గే మల్లేశ్, రత్నం. ఎనిమిదేళ్ల కిందట రత్నం, గత నెల రోజుల కిందట మల్లేశ్ అనారోగ్యం బారిన పడి మృతి చెందారు. దీంతో అనాథలైన ముగ్గురు చిన్నారులను విధి లేక నానమ్మ అయిన అక్కమ్మ పంచన చేరారు. వృద్ధాప్య పించనుతో జీవిస్తున్న ఆమెకు వారు భారంగా మారారు. ఈ విషయం 15 రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన కొయ్యూరుకు చెందిన ప్రస్తుతం గూడెం కొత్తవీధి మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తున్న సత్యనారాయణ తుమ్మలబంధ వెళ్లి చిన్నారులకు చూస్తున్న అక్కమ్మకు దుస్తులతోపాటు రూ 2 వేలు సాయమందించారు. ఆ ముగ్గురు చదువులకుసహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇంగువ రామన్నపడాల్, దుమంతి రామకృష్ణ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు



సారా బట్టీలపై దాడులు నిర్వహిస్తున్న బోర్డర్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీ పోలీస్ సిబ్బంది

అనంతగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గుమ్మకోట పంచాయతీ కొత్తపేట, తమ్మనదొర వలస గ్రామాల్లో సారా బట్టీలపై గురువారం బోర్డర్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ శ్రీధర్ మాట్లాడుతూ.. ఈ రెండు గ్రామాల్లో 4600 లీటర్ల పులుపుతో పాటుగా 40 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్టు వివరించారు. గ్రామాల్లో సారా అమ్మకాలు, తయారీ వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. మద్యానికి బానిసలై కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ప్రతి ఒక్కరు ఈ విషయాన్ని గ్రహించి, నడుచుకోవాలన్నారు. ఈ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

తీగెల బొప్పాయి!

గూడెంకొత్తవీధి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా బొప్పాయి చెట్ల ప్రధాన కాండానికి కాయ లు అతుక్కొని ఉంటాయి. కానీ, జీకేవీధి పంచాయతీ డి.కొత్తూరు గ్రామంలో భీమరాజు పెరట్లోని తీగల కు వేలాడుతూ కాయలు కాశాయి. స్థానికులు వీటిని చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మూ డేళ్ల క్రితం సంతలో కొనుగోలు చేసి మొ క్కలను పెరట్లో నాటామని, ప్రస్తుతం కాపురావడంతో వేలాడేలా బొప్పాయిలు కాస్తున్నట్లు రైతు చెబుతున్నారు.



డి.కొత్తూరు భీమరాజు పెరట్లో తీగలకు బొప్పాయిలు

శ్రమదానంతో రహదారికి మరమ్మతులు



మట్టిరోడ్డును బాగుచేసుకుంటున్న దాయర్తి గిరిజనులు

అనంతగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీనబాడు పంచాయతీ దాయర్తి గ్రామ గిరిజనులు గురువారం శ్రమదానంతో తాత్కాలికంగా బాగు చేసుకున్నారు.. వర్షాలకు మట్టిరోడ్డు అధ్వానంగా మారింది.. వాహనాలు వెళ్లేపరిస్థితి లేదు.. బీటీ రహదారి నిర్మించాలని గ్రామస్థులు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయింది.. దీంతో తాత్కాలికంగా సుమారు మూడు కిలో మీటర్ల రోడ్డును గుంతలను మూసివేసి, రోడ్డును బాగుచేసుకున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి, తమ గ్రామానికి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు..

20న మండల సమావేశం

చింతపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల సర్వ సభ్య సమావేశం ఈనెల 20తేదీన మండలాధ్యక్షురాలు కోరాబు అనుష దేవి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు స్థానిక ఎంపీడీవో యూఎస్ వీ శ్రీనివాసరావు అన్నారు. ఈసమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు హాజరుకావాలన్నారు. ఇప్పటికే ఆహ్వాన పత్రికలు పంపించామన్నారు. అధికారులు సమావేశానికి విధిగా హాజరుకావాలన్నారు.

'దురుసుగా ప్రవర్తించిన పాస్టర్లపై చర్యలు తీసుకోవాలి'



నూకరాయి పేటలో నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ, అర్చక సంఘం ప్రతినిధులు

కొయ్యూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కనుమ పండుగ సందర్భంగా విరాళాలు సేకరిస్తున్న మహిళలను కించపరిచి, విరాళాలు సేకరిస్తున్న పాత్రలను కారుతో తొక్కించిన పాస్టర్లను కఠినంగా శిక్షించాలని విశ్వ హిందూ పరిషత్, ఆదివాసీ అర్చక సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కనుమ పండగను పురస్కరించుకుని బుధవారం బూదరాళ్ల పంచాయతీ నూకరాయితోట గ్రామ మహిళలు రహదారిపై విరాళాలు సేకరిస్తున్నారని, సమయంలో కారులో అటుగా వెళుతున్న పాస్టర్లు.. దురుసుగా ప్రకవర్తించి, విరాళాల సేకరణ పాత్రలను కారుతో తొక్కించి ధ్వంసం చేశారని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆదివాసీ అర్చక సంఘం ప్రతినిధులు గురువారం గ్రామానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని పాస్టర్లు పల్లెల్లోకి వచ్చి మత మార్పిడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. పాస్టర్ల చర్యలను తాము ఖండిస్తున్నామని, అధికారులు స్పందించి వీరిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ, ఆదివాసీ అర్చక సంఘం ప్రతినిదులు మల్లిబాబు, వీర్రాజు, సోమరాజు, దేముడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరురూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జీకేవీధి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ కుంకుమపూడి ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నందున 17వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆ మండలంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని పాడేరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీఎస్ఎం అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. కుంకుమపూడి చిన్న అగ్రహారం, పెద్ద అగ్రహారం, పీకే.గూడెం, కొమ్ముచంపంగి, పాములాయి, తీములబంధ గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

గిరి గ్రామాల్లో సంక్రాంతి శోభ

- వివిధ వేషధారణాలతో ఆకట్టుకున్న యువత

డుంబ్రిగుడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లోని గిరిజనులు సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహిచుకున్నారు. మూడు రోజులపాటు ధర్మ సంక్రాంతి పేరిట ఈ ఉత్సవాలు జరుపుతారు. ఈ సందర్భంగా గిరి మహిళలు ఇళ్ల ముంగిట పలు రకాలు ముగ్గులు, బొమ్మలతో అలంకరిస్తారు. గిరిజనులు వివిధ వేషధారణలు, డప్పువాయిద్యాలతో థింసా నృత్యాలతో వీధి వీధినా సేర్ భూడియాలతో పండుగా ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలో గ్రామాల్లో సంక్రాంతి కళ సంతరించుకుంది.



పుష్ప వేషధారణలో బోంద్రుగూడకు చెందిన యువకుడు

గ్రామాల్లో సంబరాలు

ముంచంగిపుట్టు: మండలంలోని ప లు గ్రామాల్లో పౌర్ణమి తరవాత సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో గురువారం గ్రామాల్లో యువత వివిధ వేషధారణలతో నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు.జోలాపుట్టు పంచాయతీ బోంద్రుగూడ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు కొర్రా మోహన్ పుష్ప సినిమాలో అల్లు అర్జున్ వేసిన మహిళా వేషధారణతో అలరించాడు. గ్రామాల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా సేర్‌బుడియా(పండుగ చందా) అడుగుతూ పాటలు పాడుతూ సందడి చేశారు.



డుంబ్రిగుడ: డప్పు వాయిద్యాలతో సేర్ బుడియాలు

యువతకు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు

పాడేరురూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఎస్‌డీసీ, పీఎం ఇంటర్న్‌షిప్‌ల ద్వారా ప్రముఖ కంపెనీలు, పరిశ్రమలోంల కల్పిస్తున్న ఇంటర్న్‌షిప్ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి డాక్టర్.పి.రోహిణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీఫార్మసీ, బీబీఏ తదితర డిగ్రీ చదివి, 21 నుంచి 24 ఏళ్ల లోపు వయసు గల వారు దీనికి అర్హులన్నారు. స్టైఫండ్ నెలకు రూ. 5, 6 వేలు కల్పిస్తారన్నారు. 12 నెలల వ్యవధి ఉంటుందన్నారు. అభ్యర్థులకు పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన సౌకర్యం ఉంటుందన్నారు. ప్రముఖ టాప్ 500 కంపెనీల్లో కోటి మందికి నైపుణ్యాల కల్పనకు ప్రభుత్వాలు రూ. 800 కోట్లతో ఈ స్కీమ్‌ను ప్రారంభించినట్టు చెప్పారు. అభ్యర్థులు రెగ్యులర్ కోర్సులో ఎన్‌రోల్ అయ్యి ఉండకూడదన్నారు. ఆన్‌లైన్, దూరవిద్య కోర్సులను అభ్యసించవచ్చు అన్నారు. కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ. 8 లక్షలకు మించి ఉండకూడదని స్పష్టం చేశారు. వివరాలకు ఫోన్లు: 99888 53335, 87126 55686, 87901 17279లను సంప్రదించాలని తెలిపారు.

విహారయాత్రలో విషాదం

- గుల్లి జలపాతంలో జారిపడి యువకుడి మృతి

పాడేరు రూరల్/ దేవరాపల్లి జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పాడేరు మండలంలోని మారుమూల ఐనాడ పంచాయతీ పరిధి గుల్లి జలపాతం (అంబోతువాగు) సందర్శనకు వచ్చిన యువకుడు వంతాల శ్యామ్‌ప్రసాద్ (22) ప్రమాద వశాత్తు కాలుజారి బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ ఘటనపై స్థానిక సీఐ డి.దీనబంధు, ఐనాడ సర్పంచ్ ఈశ్వరరావు అందించిన వివరాలివి... దేవరాపల్లి మండలం ఎన్.గజపతినగరానికి చెందిన వంతాల శ్రీధర్ కుటుంబ సభ్యులు. బుధవారం గుల్లి జలపాతాన్ని తిలకించేందుకు వచ్చారు. ఓ రాయిపై నిలబడిన శ్యామ్‌ప్రసాద్ కాలుజారి గెడ్డలో పడిపోవడంతో నీటిలో మునిగిపోయాడు. అక్కడున్నవారు బయటకు తీసి తలకు గాయం కావడంతో వెంటనే కారులో ఆస్పత్రికి తరలించారు. శ్యామ్ సుందర్ మార్గ మధ్యలో మృతి చెందాడు. ఈ సంఘటనపై బుధవారం రాత్రి మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై స్థానిక ఎస్ఐ సూర్యనారాయణ కేసు నమోదుచేసినట్టు సీఐ దీనబంధు తెలిపారు.

స్వగ్రామంలో విషాదఛాయలు

మృతుడు శ్యామ్ ప్రసాద్ స్వగ్రామమైన నృసింహ గజపతినగరంలో విషాదఛాయలు అలముకున్నాయి. డిగ్రీ వరకు చదువుకున్న శ్యాంప్రసాదు రెండు నెలల క్రితం ప్రైవేటు ఉద్యోగంలో చేరాడు. విశాఖ పట్టాభి రెడ్డి గార్డెన్స్‌లో తాత్కాలికంగా నివాసం ఉంటున్నాడు. సంక్రాంతికి వచ్చి గురువారం గ్రామంలో జరగనున్న నారితల్లమ్మ గ్రామ దేవత తీర్థం చూసుకుని వెళ్ల వచ్చని 20 మంది స్నేహితులతో కలసి బుధవారం జలపాతం చూసేందుకు వెళ్లాడు. అయితే ఇలా అర్థాంతరంగా మృత్యువాత పడడంతో తల్లి, తండ్రులు శ్రీధర్, లక్ష్మి కన్నీరుమున్నీరవుతున్నారు. తండ్రి శ్రీధర్ జీవీఎంసీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నారు. వీరి తొలి సంతానం దివ్యాంగుడిగా ఇటీవల మృతి చెందగా, రెండవ సంతానం అయిన శ్యాంప్రసాదు ఇప్పుడు శాశ్వతంగా దూరం కావడంతో ఆ కుటుంబంతోపాటు గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. దీంతో గురువారం గజపతినగరంలో జరగాల్సిన నారితల్లమ్మ గ్రామ దేవత తీర్థం నిలిపివేశారు.



ప్రమాదం జరిగే కొద్దిసేపు ముందు సెల్ఫీ తీసుకుంటున్న శ్యామ్‌ప్రసాద్

అనర్హులైన ఎస్సీ,ఎస్టీలు విద్యుత్ బిల్లులు చెల్లించాలి

- ఈపీడీసీఎల్ డిఈఈ సన్నిరాంబాబు



మాట్లాడుతున్న డీఈఈ సన్నిరాంబాబు

చింతపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అనర్హులైన ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించాలని స్థానిక ఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) కోట్ల సన్నిరాంబాబు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మా ట్లాడారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ఉచిత విద్యుత్ సదుపాయం కల్పిస్తోందన్నారు. ఈ వినియోగదారులకు 200 యూనిట్లు లోపు విద్యుత్‌ను వినియోగిస్తే బిల్లు చెల్లించాల్సిన అవసరంలేదన్నారు. అయితే పోడు భూమి పది ఎకరాలు, పల్లం భూమి మూడెకాలుంటే ఈపథకానికి అనర్హులన్నారు. అలాగే కుటుంబంలో నెలకు రూ.12వేలు మించి ఆదాయమున్న ప్రభుత్వ ఉద్యోగి, ఆదాయపన్ను చెల్లించే వ్యక్తులు అనర్హులన్నారు. సబ్ డివిజన్ కేంద్రంలో 5,770 మంది అనర్హులైన ఎస్సీ, ఎస్టీలు బిల్లు చెల్లించాల్సిఉందన్నారు. రూ. 5వేలు పైబడిన బకాయిలు కలిగిన వినియోగదారులు 1,074మంది ఉన్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలు ఇప్పటి వరకు రూ.1.74కోట్ల విద్యుత్ బకాయిలున్నట్టు పేర్కొన్నారు. వీరికి ఈపీడీసీఎల్ అధికారులు విద్యుత్ బిల్లులు అందజేసి నగదు చెల్లించాలని కోరినట్టు చెప్పారు. లేకుంటే నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. ఏఈఈ వనుము ప్రభాకరరావు పాల్గొన్నారు.

నామినేటేడ్ పదవులకు ఆశావహుల యత్నాలు

... 5వ పేజీ తరువాయి

ఆశలు చిగురించాయి. రాష్ట్రస్థాయితోపాటు ఉమ్మడి జిల్లాస్థాయిలో డీసీసీబీ, డీసీఎంఎస్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌ల పదవులను ఆశిస్తున్నారు.

పెరుగుతున్న ఆశావహులు

మూడో విడత నామినేటెడ్ పదవులను ఒకటి, రెండు రోజుల్లో భర్తీ చేసే అవకాశం ఉందని సంకేతాలు వెలువడడంతో కూటమి పార్టీల్లో రోజుకో కొత్త పేరు తెరపైకి వస్తున్నది. పలువురు నాయకులు తమ బయోడేటా (పార్టీలో ఎంత కాలం నుంచి వుంటున్నది, ఏయే పదవులు నిర్వహించింది, సామాజిక వర్గం, పార్టీకి చేసిన సేవలు.. వగైరా)ను పార్టీ అధిష్ఠానానికి పంపుతున్నారు. మాజీ ఎమ్మెల్యేలు గవిరెడ్డి రామానాయుడు, బోళం ముత్యాలపాప, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ లాలం భవానీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశినాయుడు.. డీసీసీబీ, డీసీఎంఎస్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పదవుల్లో ఏదో ఒకటి దక్కుతుందన్న ఆశతో వున్నారు. మూడో విడత నామినేటెడ్ పదవుల భర్తీలో తమకు అవకాశం ఇవ్వాలని ఇప్పటికే అధిష్ఠానాన్ని కోరినట్టు తెలిసింది. కాగా కూటమిలో భాగమైన జనసేన పార్టీ నాయకులు కూడా నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తనకు నామినేటెడ్ పదవి కేటాయించాలని ఇటీవల పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిసి కోరినట్టు సమాచారం.

ఇన్‌-చార్జుల మార్పుపై వైసీపీ కసరత్తు

... 5వ పేజీ తరువాయి

మాజీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు, బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు,రావికమతం మండలానికి చెందిన కంచిపాటి జగన్నాథరావు పేర్లు పరిశీలించింది. అయితే వీరంతా మండలస్థాయి నేతలే కావడంతో చివరకు అమర్‌ను సమన్వయకర్తగా నియమించాలని నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. ఈ మేరకు మరో వారం రోజుల్లో అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలిసింది. మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడును తిరిగి మాడుగుల సమన్వయకర్తగా నియమించనున్నట్టు సమాచారం.

గోవాడ షుగర్స్ కార్మికుల ఆందోళన

... 5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ, వేతన బకాయిలు చెల్లించేంత వరకు కార్మికులు విధులకు హాజరుకారని స్పష్టం చేశారు.

చెరకు క్రషింగ్ మరింత జాప్యం

సంక్రాంతి పండుగ తరువాత రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభించడానికి యాజమాన్యం సిద్ధమైంది. కానీ బకాయి వేతనాల విషయమై కార్మికులు ఆందోళనకు దిగడంతో చివరి దశ పనుల్లో ప్రతిష్ఠంభన నెలకొంది. దీంతో శుక్రవారం ప్రారంభం కావలసిన చెరకు క్రషింగ్‌ను వాయిదా వేశారు. క్రషింగ్ ఎప్పుడు ప్రారంభం అవుతుందో ఫ్యాక్టరీవర్గాలు చెప్పలేకపోతున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది చెరకు క్రషింగ్ నెల రోజులకుపైగా ఆలస్యమైంది. క్రషింగ్ జరుగుతుందా? లేదా? అన్న సందేహాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, కూటమి నేతలు స్పందించి షుగర్ ఫ్యాక్టరీలో పరిస్థితులను చక్కదిద్ది, సత్వరమే చెరకు క్రషింగ్ ప్రారంభించేలా చూడాలని రైతులు రైతులు కోరుతున్నారు.

సముద్ర తీరంలో ఇసుక దోపిడీ

... 5వ పేజీ తరువాయి

మట్టి, గ్రావెల్ బదులు సముద్రం ఇసుకను వినియోగిస్తున్నారు. ఇందుకోసం సముద్ర తీరంలో ఇసుక తిన్నెలను తవ్వేస్తూ ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్నారు. దూరాన్ని బట్టి ట్రాక్టర్ ఇసుక రూ.3,500 నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తున్నారు. అటవీ శాఖ పరిధిలోని సముద్ర తీరంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నప్పటికీ ఆ శాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి అయినా చూడడంలేదు. అటవీ శాఖతోపాటు రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు కూడా వెంటనే స్పందించి సముద్ర తీరంలో ఇసుక తవ్వకాలను కట్టడి చేయాలని, లేకపోతే తుఫాన్లు సంభవించినప్పుడు సముద్రం నీరు గ్రామాలను ముంచెత్తే ప్రమాదం వుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పశువుల బీమాకు బ్రేకులు

... 5వ పేజీ తరువాయి

చేయించడం మొదలుపెట్టారు. ఈ పథకం అమల్లోకి వచ్చిన తరువాత బీమా చేయించిన పశువుల్లో కొన్ని వివిధ కారణాల వల్ల మృత్యువాత పడగా, బాధిత రైతులకు బీమా కంపెనీ నుంచి నష్టపరిహారం అందింది. ఆ సొమ్ముతో రైతులు కొత్త పశువులను/జీవాలను కొనుగోలు చేసుకున్నారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పశువుల బీమా పథకాన్ని ఆపేసింది. దీంతో రైతులు తమ సొంత ఖర్చుతో బీమా చేయించుకోవాల్సి వచ్చింది. ఆర్థికంగా ఇది భారంగా వుండడంతో చిన్న, సన్నకారు రైతులు పశువులను బీమా చేయించుకోలేకపోయారు. ఈ విషయంలో ప్రభుత్వంపై వ్యతిరేకత రావడంతో ఎట్టకేలకే నాలుగేళ్ల తరువాత దిద్దుబాటు చర్యలు చేపట్టింది. 2023 జూన్ నుంచి పశువుల బీమా పథకాన్ని పునరుద్ధరించింది. ప్రీమియం గడువు ఏడాది కాగా గత ఏడాది జూన్‌తో గడువు ముగిసింది. ఇదే సమయంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వినతి మేరకు బీమా కంపెనీలు కొంతకాలం పొడిగించాయి. అయితే పశు బీమా పథకాన్ని మరింత పక్కాగా అమలు చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబరు నుంచి తాత్కాలికంగా నిలుపుదల చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) నుంచి పశు బీమా పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

నాతవరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీనరసింహస్వామి కొలువుదీరిన ఈరుడి కొండ చుట్టూ భక్తులు గురువారం ప్రదక్షిణ నిర్వహించారు. నాతవరంలోని దేవాంగుల వీధి, కోటమ్మతల్లి ఆలయాల మీదుగా సాయి బాబా గుడి ఏపీపురం బోడకొండమ్మతల్లి ఆలయం రాజులబాబు ఆలయం దాటు కుంటూ జైశ్రీరామ్ నినాదాలు చేసుకుంటూ 14 కిలోమీటర్లు గిరిప్రదక్షిణ చేపట్టారు. అనంతరం భక్తులు ఈరూడికొండపై కొలువు దీరిన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకుని పూజలు జరిపారు. గుడపర్తి సత్య నారాయణ, కొమ్మన శ్రీను, కామిరెడ్డి వాసు, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

» గిట్టుబాటు ధర లభిస్తోందంటున్న రైతులు

గొలుగొండ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను ముమ్మరం చేసింది. దీంతో రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తోంది. మండలంలో ఇప్పటికే 600 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. గత ఏడాది ఖరీఫ్‌లో 200 టన్నులు ధాన్యం సేకరిస్తే.. ఈ ఏడాది 600 టన్నులు సేకరించింది. రైతుల కల్లాల వద్ద ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నదని రైతులు సంబరపడుతున్నారు. అంతేకాకుండా ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతున్నదని రైతులు తెలిపారు. మండలంలో ఖరీఫ్‌లో 1200 హెక్టార్లలో వరి సాగు చేప ట్టారు. వాతావరణం అనుకూలించడంతో వరి పంట మంచి దిగుబడి వచ్చింది. దీంతో పాతమల్లంపేట, గొలుగొండ, ఏటిగైరం పేట, కొత్తఎల్లవరం, అమ్మపేట, పాకలపాడు, చీడిగుమ్మల, పప్పు శెట్టిపాలెం, చోద్యం, కృష్ణాదేవిపేట, లింగంపేట, సాలికమల్లవరం గ్రామాల్లో వరి పంటను నూర్పులు చేపట్టారు. నూర్పులు చేపట్టిన ధాన్యాన్ని నేరుగా రైతుల కల్లాల వద్దకు మిల్లర్లు వెళ్లి కొనుగోలు చేశారు. కూటమి ప్రభుత్వం క్వింటా(100 కిలోల) ధాన్యానికి రూ.2,300 ధర ప్రకటించడంతో గిట్టుబాటుగా ఉన్నదని రైతులు తెలిపారు.



పాతమల్లంపేటలో ధాన్యం కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై తరలిస్తున్న దృశ్యం

విక్రయించిన 3 గంటల్లో డబ్బులు జమ

చింతకాయల గోపి, చిన్నయ్యపాలెం



రెండు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. మిల్లర్లకు 60 క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయించాను. ధాన్యం విక్రయించిన మూడు గంటల్లో బ్యాంకులో నగదు జమ అయ్యింది. వ్యాపారులకు విక్రయించే కంటే ప్రభుత్వానికి విక్రయించడం మంచిది.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



కుటుంబానికి నగదు అందిస్తున్న నాయకులు

మాకవరపాలెం,జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మృతుని కుటుంబానికి టీడీపీ నాయకులు గురువారం ఆర్థిక సాయం అందించారు. సుభద్రపురం గ్రామానికి చెందిన గంగరాజు ఇటీవల మృతిచెందారు. పేదకుటుంబం కావ డంతో వారికి ఎరకన్నపాలెం గ్రామస్తులు పదివేల రూపాయలను పోగుచేసి టీడీపీ నాయకుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్ర మంలో నాయకులు అడిగర్ల ఎర్రినాయుడు, నూకరాజు, సత్తిబాబు, గంగారావు తదిత రులు పాల్గొన్నారు.

త్వరలో చేతివృత్తిదారుల ఆన్‌లైన్ సేవలు

» మునిసిపాలిటీలో 200 మందికి పైగా ఎంపిక

» సర్వీసు ప్రొవైడర్ల మేళాలలో పేర్లు నమోదు

» అందుబాటులోకి రానున్న హోం ట్రయాంగిల్ యాప్

నర్సీపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : చేతి వృత్తిదారుల ఆన్‌లైన్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో సర్వీసు ప్రొవైడర్స్ నియామకాలు చేపట్టింది. ఈనెల పదో తేదీన జరిగిన మేళాలో మునిసిపాలిటీలోని 200మందికి పైగా చేతి వృత్తిదారులైన ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, ఏసీ, ఫ్రిజ్ మెకానిక్, కార్పెంటర్స్ సెలూన్, బ్యూటీషియన్ల పేర్లు నమోదు చేసుకున్నారు. వీరికి ప్రత్యేకంగా పదిహేను రోజుల పాటు శిక్షణ ఇస్తారు. అనంతరం డ్రెస్ కోడ్, గుర్తింపు కార్డులు అందజేస్తారు. సబ్‌స్క్రిప్షన్ ఫీజుగా నెలకు రూ.1500లు చొప్పున మూడు నెలలకు రూ.4500 వారి బ్యాంక్ ఖాతాలో జమ చేసి ఫ్రీజ్ చేస్తారు.

త్వరలో హోం ట్రయాంగిల్ యాప్

ప్రభుత్వం త్వరలో హోం ట్రయాంగిల్ యాప్ అందుబాటులోకి తీసుకు రానుంది. తద్వారా చేతి వృత్తిదారుల సేవలు గడప గడపకు తీ సుకు వెళ్లి వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని భావిస్తోంది. ప్లంబర్లు, కార్పెంటర్ల సేవలు అవసరం పడినప్పుడు, ఫ్రిజ్‌లు, ఏసీలు ఇతర గృహోపకరణాలు మరమ్మతులు గురైనప్పుడు హోం ట్రయాంగిల్ యాప్ ఓపెన్ చేసి ఏ సేవలు అవసరమో ఎంటర్ చేయాలి. యాప్‌లో పే ర్కొన్న సేవా రుసుము వెసులుబాటుగా ఉంది అనిపిస్తే సేవలు పొందవచ్చు. సర్వీసు ప్రొవైడర్స్ నేరుగా ఇంటికి వచ్చి గృహోపకరణాలు మరమ్మతులు చేసి వెళతారు.హోంట్ర యాంగిల్ యాప్ ప్రజలకు అందు లోకి వస్తే చేతి వృత్తి పని మీద ఆధారపడి జీవిస్తున్న ఏసీ, ఫ్రిజ్, వా షింగ్ మిషన్ మెకానిక్‌లు, ఎలక్ట్రీషన్లు, సెలూన్, బ్యూటీషీన్ల =జీవనోపాధి మెరుగుపడుతుందని మెప్మా అధికారులు అంటున్నారు. సర్వీసు ప్రొవైడ ర్స్‌గా ఎంపికైనవారు రోజు వారీ చేతి వృత్తి చేసుకుంటూనే, ట్రయాంగిల్ యాప్‌లోని సేవలు అం దించవచ్చు. తద్వారా ప్రతి నెలా అదనపు ఆదా యం సంపాదించుకునే వెసులుబాటువస్తుంది. వారి కింద పని చేసే సిబ్బందికి కూడా చేతి నిండా పని దొరుకుతుంది.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవం



గౌరీపరమేశ్వరుల విగ్రహాల ఊరేగింపు.., అమ్మవారికి సారెను తీసుకు వెళుతున్న మహిళలు

నాతవరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నాతవరంలో గురువారం గౌరీ పరమేశ్వరుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆది దంపతులకు విశేష పూజలు జరిపారు. గుర్రాలతో ప్రత్యేక రథాన్ని ఏర్పాటు చేసి అందులో ఉత్సవ విగ్రహా లను ఏర్పాటు చేసి గ్రామ పురవీధుల్లో ఊరే గింపు నిర్వహించారు. భక్తులు వివిధ రకాల పిండి వంటలను ఇంట్లో తయారు చేయించి గౌరమ్మకు సారెను ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. సుమారు కిలోమీటరు పొడవున డప్పు వాయిద్యాలు, చిన్నారుల వేషధారణలతో ఈ కార్యక్రమం సాగింది. అనంతరం మహిళలు సారెను అమ్మవారికి నైవేద్యంగా సమర్పిం చారు. సాయంత్రం నాతవరం రామాలయం వద్ద తీర్థం నిర్వహించారు.

అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి : బత్తుల

అనకాపల్లి టౌన్, జనవరి 16 (ఆంధ్ర జ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని ఈ నెల 18న నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనిర్వహించాలని టీడీపీ జిల్లా అధ్య క్షుడు బత్తుల తాతయ్యబాబు పిలుపుని చ్చారు. గురువారం ఇక్కడ విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పీలా, నాయకులు పీవీజీ కుమార్, మళ్ల సురేంద్ర, కాయల మురళి, కోట్ని బాలాజీ, బీఎస్ఎంకే జోగినాయుడు, బొలిశెట్టి శ్రీనివాసరావు, గొంతిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా రాములవారి తీర్థాలు



సాలికమల్లవరంలో కోలాటం

గొలుగొండ/కృష్ణాదేవిపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం తీర్థాలను ఘనంగా నిర్వహించారు. కొత్తఎల్లవరం, రావణాపల్లి, కొత్తపాలెం, జి.కొత్తూరు, సీహెచ్.నాగాపురం గ్రామాల్లో ఈ వేడుకలు జరిగాయి. సీతారాముల ఆలయాలకు వెళ్లి భక్తులు పూజలు నిర్వహించారు. సాలికమ ల్లవరం రామాలయం వద్ద మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు సుర్ల బాబ్జి, పెదిరెడ్ల మల్లేశ్వర రావు, కొల్లాన కొండలరావు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సీహెచ్ నాగా పురంలో జరిగిన వేడు కల్లో భాగంగా ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు, మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, కూటమి నాయకులు రేగుబల్ల శివ, బొప్పన ప్రసాద్, సేనాపతి వరహాలబాబు పాల్గొన్నారు.



నాగాపురం రామాలయంలో భక్తుల భజనలు

పకడ్బందీగా రహదారి భద్రత మాసోత్సవాలు : జేసీ

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్ర జ్యోతి) : జాతీయ రహదారి భద్రత మాసోత్స వాలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గురు వారం ఇందుకు సంబంధించి రవాణా, పోలీసు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమా దాల వల్ల ఒక ప్రాణాన్ని పోగొట్టుకున్నా తిరిగి రాని పరిస్థితి అన్నారు. ఇతరుల పొరపాటు వ ల్ల ప్రాణాలు కోల్పోవచ్చని, ప్రమాదాలు జరగ కుండా సురక్షిత డ్రైవింగ్‌పై అందరికీ విస్తృ తంగా అవగాహన కల్పించాలని సూచించారు. గురువారం ప్రారంభమైన ఈ మాసోత్సవాలు ఫిబ్రవరి 15వ తేదీ వరకు వివిధ కార్యక్రమాల ద్వారా నిర్వహించాలన్నారు. 17న రహదారి భ ద్రతపై అవగాహన కల్పిం చేందుకు స్వచ్ఛంద సంస్థలు, డ్రైవింగ్ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్లు, రిటైర్డ్ ఏపీఎస్ ఆర్టీసీ సిబ్బందితో వలంటీర్లను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. 18వ తేదీ నుంచి కార్యక్రమం పూర్తయిన వరకు చేపట్టా ల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా రవాణా శాఖాధికారి జి.మనోహర్, అనకాపల్లి ట్రాఫిక్ సీఐ ఎం. వెంకటనారాయణ, మోటార్ వెహికల్, అసి స్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, రవాణా, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యాటకులతో రైవాడ జలాశయం కిటకిట



రైవాడ జలాశయం వద్ద పర్యాటకులు

దేవరాపల్లి, జనవరి16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయం పర్యాటకులతో కిటకిట లాడింది. జలాశయం ఆనుకుని ఉన్న ఎరకాలమ్మ గ్రామ దేవత తీర్థంతో పాటు సంక్రాంతికి వచ్చిన వివిధ గ్రామాల పర్యాటకు లతో సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి వరకు అక్కడే గడిపి సెల్ఫీలు తీసుకున్నారు.

గోవాడలో ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



గోవాడలో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు షీల్డు అందచేస్తున్న దృశ్యం

చోడవరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వివేకానంద యువజనోత్సవాల్లో భాగంగా మండలంలోని గోవాడలో సంక్రాంతిపురస్కరించుకుని ఈనెల 12న ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. గ్రామ జడ్పీ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న ఈ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో విజేత లకు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు, బేరా సత్యారావు, యూత్ నాయకుడు పుల్లేటి వెంకటేశ్ షీల్డులు అందించారు. నిర్వాహకులు కొలగాని సతీష్ స్థానిక నాయకులు వేపాడ వెంకట్, సాయి. సంతోశ్, చిన్న, యశ్వంత్, బాలసాయి తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థకు చేరిన జమ్మాదేవిపేట పశు వైద్యశాల



స్లాబ్ పెచ్చులూడిన దృశ్యం

శిథిలావస్థలో పశు వైద్యశాల భవనం

» జమ్మాదేవి పేటలో పశువైద్య సిబ్బంది పాట్లు

» పరిసర గ్రామాల రైతులకు అంతంతమాత్రంగా సేవలు

మాడుగుల రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మాదేవిపే ట పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం శ్లాబ్ పెచ్చులూడి పోయి ఎప్పుడు కూలిపోతుందో తెలియని ప్రమాదకర పరిస్థితిలో ఉంది. ఈ ఆ స్పత్రి పరిధిలోని జమ్మాదేవిపేట, గాదిరాయి, లోవ గవరవరం, కొండలపాడు గ్రామాల్లోని సుమారు 450 మంది రైతులకు చెందిన 2200 పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. పశు వైద్యశాల భవనాన్ని 1997లో నిర్మించారు. ప్రస్తు తం గది, వరండా శాబులో ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో వర్షానికి నీరు లోపలకు చేరుతోంది.

ఫలితంగా ఈ గదిలో సామగ్రి, పాడి రైతులకు చెందిన పశుగ్రాస విత్తనా లు, మందులు భద్రపరుచుకోవడం కష్టంగా మారుతున్నదని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతిని ధుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా పశు వైద్యశాలకు నూతన భవనం నిర్మించి తమ కష్టాలు తీర్చాలని రైతులు, సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు.

20 తేదీ నుంచి పశు వైద్య శిబిరాలు

మాడుగుల రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మాడుగుల, చీ డికాడ మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఈ నెల 20 తేదీ నుంచి 31 తేదీ వరకు పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మాడుగుల ప్రాం తీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాల్లో పశువులకు, దూడ పెయ్యిలకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు అందిస్తామన్నారు. గ్రామాల్లో గొర్రెలు, మేకలకు, కోళ్లకు టీకా కార్యక్రమం నిర్వహిస్తామ న్నారు. అనారోగ్యంతో ఉన్న ఎదకు రాని, గర్భకోశ వ్యాధులున్న పశు వులకు ఉచితంగా చికిత్సలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతీ మండ లంలో రోజుకు రెండు గ్రామాలలో ఈ శిబిరాలు నిర్వహించను న్నట్టు, దీనికి సంబంధించి పశు వైద్యాధికారి, పశు వైద్య సహాయకు డు , రైతు సేవా కేంద్రాల్లోని పశు వైద్య సహాయకులతో రెండు బృందాలు ఏర్పాటు చేశామని చిట్టినాయుడు పేర్కొన్నారు.

వైసీపీ సోషల్ మీడియా వింగ్ జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



అధ్యక్షుడిగా నియమితులైన గుర్రాల నాగేశ్వరరావు

రోలుగుంట, జనవరి 16(ఆంధ్రజ్యోతి) : వైసీపీ సోషల్ మీడియా వింగ్ జిల్లా అధ్యక్షుడిగా రోలుగుంట మండలం కొవ్వూరుకు చెందిన గుర్రాల నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కా ర్యాలయం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. నాగే శ్వరరావు వైసీపీ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుగ్గా ఉంటూ పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియా వేదికగా చేరువ చేయడంలో ముందుంటు న్నాడు. దీంతో పాటు గతంలో వలంటీర్ల మండల క న్వీనర్‌గా కూడా పనిచేశారు. నాగేశ్వరరావు నియామ కంపై ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఆ పార్టీ సీనియర్ నాయకులు యర్రంశెట్టి రాజారావు, సర్పంచ్ కాంతమ్మ తదితరులు అభినందనలు తెలిపారు.

'బ్లాక్‌లో సినిమా టికెట్ల విక్రయాలు'

చోడవరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సా యిలక్ష్మి థియేటర్‌లో బ్లాక్‌లో సినిమా టిక్కెట్లు విక్రయిస్తూ ప్రేక్షకులను దోచుకుంటున్నట్టు పట్టణ పండ్ల వర్త కుల సంఘం కార్యదర్శి ఆబోతుల శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం ఉదయం టిక్కెట్ల కోసం సినిమాహాలుకి వెళితే, కౌంటర్‌లో టిక్కెట్లు లేవని సమాధానమిచ్చారన్నారు. తన లాగే చాలామంది టిక్కెట్లు లభించక నిరాశతో వెనక్కి వచ్చారన్నారు. అయితే, థియేటర్ బయట రూ.150 టిక్కెట్ రూ. 500 నుంచి రూ.800లకు విక్రయిస్తున్నారన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

శ్రీ కళ్యాణి పోతురాజు మరియు పెద్దింటమ్మ వారి దేవస్థానం
దేవదాయ ధర్మాదాయశాఖ
చీమలపాడు (కళ్యాణపులోవ) గ్రామం, రావికమతం మం. అనకాపల్లి జిల్లా

టెండరు-కమ్-బహిరంగ వేలం ప్రకటన

అనకాపల్లి జిల్లా, రావికమతం మండలం, కళ్యాణపులోవ గ్రామంలో వేంచేసి యున్న **శ్రీ కళ్యాణిపోతురాజు మరియు పెద్దింటమ్మ వారి దేవస్థానం** దేవదాయ ధర్మాదాయశాఖ యొక్క **మహా శివరాత్రి జాతర ఉత్సవములు** సందర్భంగా **తేది.26-02-2025 నుండి 28-02-2025** వరకు అనగా 3 రోజులు మాత్రమే శ్రీ స్వామి వారికి భక్తులచే సమర్పించబడిన తలనీలాలు, కొబ్బరిముక్కలు ప్రోగుచేసుకుని తీసుకునే హక్కునకు తేదీ 20-01-2025దిన అనగా సోమవారం మధ్యాహ్నం 02.00 గంటలకు శ్రీ స్వామి వారి దేవస్థానం వద్ద, దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు పర్యవేక్షణలో గ్రామ పెద్దల సమక్షములో బహిరంగ వేలం పాట నిర్వహించబడును.

తేది.	సమయం	స్థలము	వివరములు
20-01-2025 సోమవారం	మధ్యాహ్నం 02.00 గం.లకు	శ్రీ స్వామి వారి దేవస్థానము, కళ్యాణపులోవ	తలనీలాలు, కొబ్బరి ముక్కలు ప్రోగు చేసుకుని తీసుకొనే హక్కునకు

పాటలో పాల్గొనవలసిన వారు గమనించవలసిన పాట షరతులు

1. పాటదారులు పాటకు ముందు ధరావత్తు సొమ్ము రూ.20,000/-లు చెల్లించి పాటలో పాల్గొను నిర్ణయము.
2. హెచ్చు పాటదారుడు పాట కొట్టివేసిన వెంటనే ప్రథమ ధరావత్తుతో కలుపుకొని మొత్తం సొమ్ము వెంటనే చెల్లించుటకు నిర్ణయం.
3. ప్రతి పాటదారుడు ఆధార్‌కార్డు నకలు తేవలెను.
4. ఏ కారణముచేతనైనా పాట అపుచేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని, రద్దు పరచుటకు గాని, దేవాదాయశాఖ ధర్మాదాయశాఖ అధికారులకు అధికారము కలదు.
5. హెచ్చు పాటదారుడు పేరున పాట కొట్టివేసిన పిమ్మట 3 బ్యాంక్ ఖాళీ చెక్‌లు దేవస్థానం అధికారులకు సమర్పించవలెను.
6. సదరు పాట దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు మంజూరు ఉత్తర్వులకు లోబడి పాట జరుగును.
7. ప్రతి పాటదారుడు తనకు గల స్థిరాస్తులను తెలియజేయు సాల్వెన్సీ సర్టిఫికేటు రూ.1,00,000/- తక్కువ కాకుండా ఆయా గ్రామాల రెవెన్యూ అధికారి వద్ద నుండి పొంది పాటకు ముందు దేవస్థానం అధికారులకు సమర్పించవలెను.
8. మిగిలిన పాట షరతులు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము, గ్రూపు దేవస్థానములు కొత్తకోట నందు తెలుసుకొనవలెను.

గ్రామము: చీమలపాడు
తేది:05-01-2025
ఫోన్ నెం.6303090838, 6302252041

ఇట్లు
ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్
శ్రీ కళ్యాణిపోతురాజు మరియు పెద్దింటమ్మ వారి దేవస్థానం
దేవదాయ ధర్మాదాయ శాఖ, చీమలపాడు గ్రామం
రావికమతం మండలం, అనకాపల్లి జిల్లా

భక్తి శ్రద్ధలతో దండు ముత్యాలమ్మ తల్లి తీర్థం

కె.కోటపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామ దేవతల తీర్థా లలో ప్రజలు ఐకమత్యంతో మెలగాలని మాడుగుల ఎమ్మెల్యే బండా రు సత్యనారాయణమూర్తి కోరారు. మండలంలోని గొండుపాలెంలో గురువారం జరిగిన దండు ముత్యాలమ్మ తల్లి అమ్మవారిని టీడీపీ నాయకులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. గుడికి సమీపంలో జరి గిన గుర్రం పందాల పోటీలకు రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీ వీజీ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు నగదు బహుమతు లను అందజేశారు. గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.



గొండుపాలెంలో గుర్రం పందేం

ఎరకాలమ్మ గ్రామ దేవత పండగ

దేవరాపల్లి: మండలంలోని రైవాడ ఎరకాలమ్మ గ్రామ దేవత తీర్థం సందర్భంగా గురువారం దర్శించుకున్నారు. ఎం.అలమండ గ్రామంలో గ్రామ దేవ తను దర్శించు కొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సూర్యనారా యణ, నానాజీ తది తరులు పాల్గొన్నారు.





విజేతలకు నగదు బహుమతులందజేస్తున్న వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్

కొత్తకోట ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

రావికమతం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట ఎంప్లాయీస్ అసోసి యేషన్(కేఈఏ) నూతన కార్యవర్గాన్ని గురువారం గర్రెడ్డి రాంబాబు అధ్యక్ష తన ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పైల సత్యనారాయణ, అధ్యక్షుడిగా అంగజాల వీర ప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా గట్టా వరప్రసాద్, ఉపాధ్యక్షు డుగా జాలిపర్తి నిరంజన్‌ను, ట్రెజరర్‌గా కేదారి శెట్టిబుజ్జి, మరో ఎనిమిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం గ్రామంలో సేవా కార్యక్రమాలు, విద్యాభివృద్ధికి తోడ్పడనున్నట్టు ఆ ప్రతిని ధులు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని పలువురు విద్యావేత్తలు అభినందిం చారు.

AJC CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, **JSLINA KANDKATLA** (Old Name), D/o. Kandikatla Ramesh Babu, R/o. 2-59, Gudimula, Sakhinetipalli, Dr. B.R.Ambedkar Kona Seema. Change my name from **JSLINA KANDKATLA** (Old Name) to **KANDIKATLA JASLINA** (New Name). Henceforth I am being called as **KANDIKATLA JASLINA** (New Name) for all purposes.
AJV_ 230796

CHANGE OF NAME

I, **KOYILADA PARVATI** (Old Name), W/o. Koilada Govinda Rao, resident of D.No. 65-1-109c, Srinivasnagar, Sriharipuram, Malkapuram (P.O), Visakhapatnam. Change my name as **KOILADA PARVATI** (New Name) W/o. Koilada Govinda Rao. Hereinafter my name is known as **KOILADA PARVATI** (New Name) W/o. Koilada Govinda Rao.

CHANGE OF NAME

I, **KOYILADA GOVINDA RAO** (Old Name), S/o. Late. Koilada Govinda Rao, resident of D.No. 65-1-109c, Srinivasnagar, Sriharipuram, Malkapuram (P.O), Visakhapatnam. Change my name as **KOILADA GOVINDA RAO** (New Name) W/o. Koilada Govinda Rao. Hereinafter my name is known as **KOILADA GOVINDA RAO** (New Name) S/o. Late. Koilada Govinda Rao.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093